

ప్రధాని పర్యటన వాయిదా



ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం పర్యటన వాయిదా పడింది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ప్రారంభించేందుకు ఈ నెల 29వ తేదీన ప్రధాని విశాఖ రావలసి ఉంది. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రధానను పర్యటన తాత్కాలికంగా వాయిదా వేశారు.

-వార్త మెయిన్ ఎడిషన్‌లో

సెంట్రల్ స్కూల్ పట్టాలెక్కేనా!

ఏడేళ్ల నుంచి కలగానే కేంద్రీయ విద్యాలయం

- గత టీడీపీ హయాంలోనే మంజూరు
- సొంత భవనాలు నిర్మించే వరకు తాత్కాలికంగా విద్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఉడ్‌పేట స్కూల్ ఆవరణలో రూ.26 లక్షలతో షెడ్ల నిర్మాణం
- ఒకే ఆవరణలో రెండు పాఠశాలల నిర్వహణపై అభ్యంతరం
- ప్రారంభంకాని తరగతులు... వృథాగా షెడ్లు
- ఆరేళ్ల క్రితం అచ్చియ్యపేటలో పది ఎకరాలు కేటాయింపు
- రోడ్డు, కల్వర్టుల నిర్మాణం, విద్యుత్ స్తంభాల కోసం రూ.39.44 లక్షలు వ్యయం
- విద్యాలయం ఏర్పాటును ఐదేళ్లపాటు పట్టించుకోని వైసీపీ పాలకులు
- కూటమి ఎంపీ సీఎం రమేశ్‌పైనే ఆశలు

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :

అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం (సెంట్రల్ స్కూల్) ఏర్పాటు కలగా మారింది. విద్యాలయం మంజూరై ఏడేళ్లు దాటినా కనీసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా స్థలం మంజూరు చేసినప్పటికీ కేంద్రం పరంగా ఇంతవరకు భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ విద్యాలయం ఏర్పాటు విషయంలో గత ఐదేళ్లపాటు అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎంపీ పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపలేదన్న ఆరోపణలు వచ్చాయి.

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు నాడు అనకాపల్లి నుంచి టీడీపీ ఎంపీగా వున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు అనకాపల్లికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించారు. స్థలం సమకూర్చి, సొంత భవనాలు నిర్మించే వరకు ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలలో దీనిని ప్రారంభించాలని భావించారు. పట్టణంలోని భీమునిగుమ్మం హైస్కూల్, మునిసిపల్ పెద్ద హైస్కూల్, ఉడ్‌పేట స్కూల్ ప్రాంగణాలను పరిశీలించారు. చివరకు ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. తాత్కాలిక వసతి కోసం 2018లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎంపీ నిధుల నుంచి రూ.26 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో షెడ్లు నిర్మించారు. అయితే ఉడ్‌పేట స్కూల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై సంబంధిత అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే ప్రాంగణంలో రెండు పాఠశాలలు వుండకూదన్న నిబంధనను తెరపైకి తెచ్చారు. దీంతో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించలేదు. తరగతుల కోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. తరువాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ప్రక్రియ రెండేళ్లపాటు త్రిశంకుస్వర్గంలో వుండిపోయింది. మూడేళ్ల క్రితం అప్పటి ఎంపీ సత్యవతి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు విషయాన్ని పార్లమెంటులో ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి ఉడ్‌పేటలో కేంద్రీయ విద్యాలయం కోసం అప్పట్లో తాత్కాలికంగా నిర్మించిన షెడ్లు



కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అచ్చియ్యపేటలో ప్రభుత్వం కేటాయించిన భూమి

మూలకు చేరిన అమూల్

పడకేసిన జగనన్న పాలవెల్లువ

- తొలుత 305 కేంద్రాలు ఏర్పాటు
- రోజుకు 50 వేల లీటర్ల పాలు సేకరించాలని లక్ష్యం
- రైతుల నుంచి కొరవడిన ఆదరణ
- 30 వేల లీటర్లకు మించని సేకరణ
- నాటి పాలకులు చెప్పిన ధర చెల్లించని యాజమాన్యం
- క్రమేపీ అమూల్‌కు తగ్గిన పాల సరఫరా
- సగానికిపైగా కేంద్రాలు మూత
- ఐదు వేల లీటర్లకు పడిపోయిన పాల సేకరణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో జగనన్న పాల వెల్లువ పథకం పడకేసింది. గుజరాత్‌కు చెందిన ప్రైవేటు డెయిరీని ప్రోత్సహించేందుకు గత వైసీపీ ప్రభుత్వం పాల రైతుల ప్రయోజనాలను విస్మరించింది. రైతులకు మేలు చేస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకొని, అమూల్ సంస్థను రంగంలోకి దించి, కమీషన్ల కోసం జగనన్న పాలవెల్లువ పథకాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే. గ్రామాల్లో పాల సేకరణకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసిన ప్రభుత్వం.. సహకార, పశుసంవర్థక, రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ శాఖల యంత్రాంగాన్ని ప్రైవేటు డెయిరీ అమూల్ సేవల్లో తరించేలా ఆదేశాలు జారీ చేసింది. అయితే అమూల్ కేంద్రాలకు పాలు సరఫరా చేసేందుకు రైతులు ఆసక్తి చూపకపోవడంతో చాలా కేంద్రాలు అంతంతమాత్రంగానే నడిచాయి. పాల సేకరణకు శ్రీ విజయ విశాఖ డెయిరీ, ఇతర ప్రైవేటు డెయిరాలు చెల్లించే దానికంటే ఎక్కువ ధరలను అమూల్ చెల్లిస్తుందంటూ వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసింది. డ్వాక్రా సంఘాలను భాగస్వాములను చేసి అమూల్‌కు పాల సేకరణ పెంచాలన్న ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. జిల్లాలో తొలివిడత 2020వ సంవత్సరంలో ... మిగతా 8వ పేజీలో



మునగపాకలో మూతపడిన అమూల్ పాల సేకరణ కేంద్రం

ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

- తరగతులకు రానివ్వకపోతే కఠిన చర్యలు
- హాల్ టికెట్లు ఆపొద్దు.. పరీక్షలకు అనుమతించాల్సిందే
- విద్యా సంస్థలకు కలెక్టర్ ఆదేశం

అనకాపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని ఇబ్బందులు పెడితే సంబంధిత విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని, బకాయిలను కూడా చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫీజులు చెల్లించలేదన్న సాకుతో విద్యార్థులను తరగతులకు హాజరుకానివ్వకపోవడం, పరీక్షల హాల్ టికెట్లు జారీ చేయకపోవడం, పరీక్షలు రాయనీయకపోవడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలకు అనుమతించాల్సిందేనని ఆదేశించారు. ఈ విషయం ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ సహా అన్ని కళాశాలలకు వర్తిస్తుందని ఆమె పేర్కొన్నారు. అదే విధంగా ... మిగతా 8వ పేజీలో

12 అంతస్థులు

రైల్వే జోన్ భవనం

నిర్మాణ వ్యయం అంచనా రూ.154.82 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుచేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితమే డిజైన్ తయారైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ 2021 ధరల ప్రకారం 12 అంతస్థుల భవన నిర్మాణానికి రూ.154.82 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. అనేక తర్జనభర్జనల అనంతరం జోనల్ కార్యాలయ భవన నిర్మాణాలకు రైల్వే శాఖ టెండర్లను ఆహ్వానించింది. ముడసర్లోవలో జీవీఎంసీ అప్పగించిన భూముల్లోనే జోనల్ కార్యాలయం నిర్మితం కానుంది.

- ఓపెన్ ఏరియాలో పార్కింగ్
- 290 కార్లు, 645 ద్విచక్ర వాహనాలకు మార్కింగ్
- ఐదో అంతస్థులో జీఎం, డీజీఎం, ఏజీఎంల కార్యాలయాలు
- భవనం వెలుపల అభివృద్ధి పనులకు రూ.10.17 కోట్లు
- లాన్, ఇంటీరియర్, ఫర్నిషింగ్‌లకు రూ.23.5 కోట్లు



రైల్వే జోన్ కార్యాలయాన్ని కార్పొరేట్ తరహాలో నిర్మించినా పర్యావరణానికి, పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం 38.4 మీటర్ల ఎత్తున నిర్మించే భవనంలో 12 అంతస్థులు ఉంటాయి. అందులో రెండు బేస్‌మెంట్లు, ఒకటి గ్రౌండ్ ఫ్లోర్. రెండు బేస్‌మెంట్లను పూర్తిగా పార్కింగ్‌కు కేటాయించారు. భవనం చుట్టూ ఉండే ఓపెన్ ఏరియాలో కూడా వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. మొత్తంగా చూసుకుంటే 290 కార్లు, 615 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు.

గ్రౌండ్ ఫ్లోర్: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీటర్లు. ఇందులో ప్రధాన ప్రవేశ ద్వారం, రియర్ లాబీ, ఆడిటోరియం, కంట్రోల్‌రూమ్, పురుషులకు, మహిళలకు వేర్వేరుగా గ్రీన్ రూమ్‌లు, కిచెన్, డైనింగ్, సెక్యూరిటీ వింగ్, స్టోర్స్, బ్యాక్ ఆఫీసు ఉంటాయి.

మొదటి అంతస్థు: బిల్టప్ ఏరియా 3,222.83 చ.మీ. ఇందులో కమర్షియల్ డిపార్టుమెంట్, వెల్ఫేర్ ఆఫీసు, సీపీఆర్‌ఓ విభాగం, జోనల్ ఆఫీసు ఉంటాయి.

రెండో అంతస్థు: బిల్టర్ ఏరియా 2,702.83 చ.మీ. ఇందులో ఎఫ్‌ఏఓ, సీఏఓ విభాగం, ఎస్ఎస్ఈ విభాగం, సేఫ్టీ డిపార్టుమెంట్, జోనల్ ఆఫీసు, జోనల్ కంట్రోల్ రూమ్, పీఈఆర్ఈఎం రూమ్ ఉంటాయి.

మూడో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 ఇందులో ... మిగతా 8వ పేజీలో

వైసీపీ నేత అక్రమ కట్టడం కూల్చివేత

- నర్సీపట్నంలో ప్లాన్ ఆమోదం లేకుండా వాణిజ్య భవన నిర్మాణం
- నాడు వైసీపీ అధికారంలో ఉండడంతో అడ్డుకోని అధికారులు
- కూటమి అధికారంలోకి వచ్చాక మూడుసార్లు నోటీసులు
- సమాధానం రాకపోవడంతో అధికారులు చర్యలు



అనుమతి లేకుండా వైసీపీ నేత నిర్మించిన భవనాన్ని కూల్చివేయిస్తున్న మునిసిపల్ అధికారులు

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు లేకుండా నిర్మించిన రెండు అంతస్థుల వాణిజ్య భవనాన్ని మునిసిపల్ అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణంపై మూడుసార్లు నోటీసులు ఇచ్చినా.. సంబంధిత భవన యజమాని స్పందించకపోవడంతో ఈ చర్యకు దిగినట్టు అధికారులు వెల్లడించారు. పట్టణంలో 26వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు చిటికెల కరుణాకరరావుకు పట్టణ పోలీస్ స్టేషన్ పక్క రోడ్డులోని గచ్చపువీధిలో 33 గజాల స్థలం వుంది. ఇందులో షాపు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని గత ఏడాది మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని కోరారు. వంద ... మిగతా 8వ పేజీలో

చిత్తశుద్ధితో పనిచేస్తా

- ప్రతిరోజు కార్యాలయంలో అందుబాటులో ఉంటా
- వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్
- సైకిల్‌పై కార్యాలయానికి రాక



ప్రణవ్ గోపాల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):

కూటమి పెద్దలు తనపై విశ్వాసం ఉంచి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారని, వారి అంచనాల మేరకు పనిచేస్తానని ప్రణవ్‌గోపాల్ చెప్పారు. ఆయన సోమవారం సాయంత్రం వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీనికి ముందు ఆయన ఎంవీపీ కాలనీలోని తన ఇంటి నుంచి సైకిల్‌పై బయలుదేరి సంపత్ వినాయకుడి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. తనను అభినందించడానికి వచ్చేవారు శాలువాలు, పూలబొకేలు, దండలు తేవద్దని ముందుగానే సూచించారు. పేద పిల్లలకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రి తీసుకురావాలని పిలుపు ఇవ్వడంతో పలువురు నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకువచ్చి ఇచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబు, బండారు ... మిగతా 8వ పేజీలో

ప్రగడ ప్రమాణ స్వీకారోత్సవానికి విజయవాడ వెళ్లిన నేతలు


విజయవాడకు తరలివెళుతున్న టీడీపీ నేతలు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మంగళవారం విజయవాడ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నేతలు మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు ఆధ్వర్యంలో విజయవాడకు తరలివెళ్లారు.

మద్యం దుకాణాల వద్ద టెంట్‌లు తొలగింపు

▸▸ నిర్వాహకులను హెచ్చరించిన ఎక్సైజ్ అధికారులు


మద్యం దుకాణాలు వెనుక ఏర్పాటు చేసిన టెంట్‌లను తొలగిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏటికొప్పాకలో మద్యం దుకాణాలు వెనుక వేసిన టెంట్‌లను ఎక్సైజ్ అధికారులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా నిబంధనలను పాటించాలని మద్యం దుకాణ నిర్వాహకులకు హెచ్చరించినట్టు ఎక్సైజ్ సీఐ తేజోవెంకట కుమార్ సోమవారం తెలిపారు. ఆదివారం ఏటికొప్పాక జాతరను పురస్కరించుకుని మద్యం దుకాణం వెనుక టెంట్‌లు ఏర్పాటు చేసినట్టు సమాచారం తెలుసుకుని రాత్రి వేళ టెంట్‌లు తొలగించామన్నారు. సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల నిర్వాహకులు విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లాను కలిసిన రంగనాయకులు


పల్లా శ్రీనివాసరావును కలిసిన యాదవ కార్పొరేషన్ డైరెక్టరు రంగనాయకులు, ఇతర నాయకులు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును గాజువాకలోని ఆయన కార్యాలయంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టరు, దూళి రంగనాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను డైరెక్టర్‌గా నియమించినందుకు పల్లాకు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిశారు. ఆయన వెంట టీడీపీ రాంబిల్లి మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, సంతపాలెం సర్పంచ్ కిల్లాడ చిన్నారావు, ఎదురువాడ సర్పంచ్ కారుకొండ శ్రీను ఉన్నారు.

ఘనంగా బోనాల పండగ


ధర్మవరం అగ్రహారంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

ఎస్.రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సోమవారం గ్రామ దేవత నూకాలమ్మ ఆలయ నాల్గో వార్షికోత్సవంలో భాగంగా బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు మహిళలు బోనాలు ఎత్తుకొని దుర్గాదేవి ఆలయం వద్ద నుంచి నూకాలమ్మ ఆలయం వరకు తీన్‌మార్ డప్పులతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

'పేట'లో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పి.చిట్టిబాబు తదితరులు

పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ముమ్మంగా చేపట్టారు. సోమవారం పట్టణంలోని కంటోన్మెంట్, నూకాలమ్మతల్లి గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పాల్గొని, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, జాజుల మరిడయ్య, మహేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

▸▸ పాయకరావుపేట సీఐ జి.అప్పన్న

పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని సీఐ జి.అప్పన్న అన్నారు. సోమవారం స్థానిక తిరుమల కళాశాలలో ఏర్పాటుచేసిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత గమ్యాలను చేరుకోవడానికి నిత్యం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెనల వద్ద పొంచి ఉన్న ప్రమాదం


రాజుకోడూరు వద్ద కొండగెడ్డ వద్ద రోడ్డుపై ఉన్న వంతెనకు ఒక వైపు రక్షణ గోడ లేని దృశ్యం.


రాజారాయుడుపాలెం వద్ద మైనర్ శారదా నదిపై ఉన్న వంతెనకు రక్షణగోడలు లేని దృశ్యం


నారాయణపురం వద్ద మైనర్ శారదాపై రక్షణ గోడ లేని వంతెన దృశ్యం

రక్షణ గోడలు లేక భీతిల్లుతున్న జనం

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రక్షణ గోడలు లేని వంతెనలు, కల్వర్టులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ వంతెనలపై నుంచి దాటే సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొనేళ్లగా ఈ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని నారాయణపురం, రాజారాయుడుపాలెం, రాజుకోడూరు, భోగాపురం గ్రామాల వద్ద మైనర్ శారదానది, కొండ గెడ్డలపై ఉన్న వంతెనలకు రక్షణ గోడలు లేకుండా పోయాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ పాలకులు గాని, అధికారులు గాని కన్నెత్తి చూడడం లేదు. రాజుకోడూరు వద్ద కొండగెడ్డ వద్ద రోడ్డుపై ఉన్న వంతెనకు ఒకవైపు రక్షణ గోడ లేదు. అలాగే రాజారాయుడుపాలెం వద్ద మైనర్ శారదా నదిపై ఉన్న వంతెనకు అసలు రక్షణ గోడలు లేవు. నారాయణపురం వద్ద ఉన్న వంతెనకు రక్షణ గోడలు లేకపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా ఉన్న వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలుమార్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంబంధిత అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నదులు, కాలువలపై రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు


రాంబిల్లి:పంచదార్ల ధర్మలింగేశ్వరుని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు


నక్కపల్లి: ఉపమాక శివాలయం వద్ద భక్తుల క్యూ

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నాలుగో సోమవారం పంచదార్ల పుణ్యక్షేత్రం శివనామ స్మరణతో మారుమోగింది. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఐదు పుణ్యధారల వద్ద భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి, పణిగిరిపై వెలసిఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ధర్మలింగేశ్వరునికి పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. మండలంలోని లాలంకోడూరు, వెల్చూరు, కొత్తపట్నం, దిమిలి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నక్కపల్లిలో..

కార్తీకమాసం నాలుగో సోమవారం మండలంలోని గొడిచెర్ల, ఉపమాక శివాలయాలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉపమాక శివాలయంలో ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్ ముక్కంటికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం స్వామివారికి సప్తహారతులిచ్చారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఉపమాక శివాలయాన్ని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ , జడ్పీటీసీ మాజీ సభ్యులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు తదితరులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక ఆఖరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెదపాడు, యర్రవరం, దోసూరు, మడుతూరు, ఎం.జగన్నాథపురం తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఆచరించారు.

పాయకరావుపేట రూరల్‌లో..

కార్తీక మాసం నాలుగో సోమవారం మండలంలోని గోపాలపట్నం సీతమ్మవారికొండ, పెద్దిపాలెం, పెంటకోట, నామవరం, సత్యవరం, రాజగోపాలపురం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెలవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకొని స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గోపాలపట్నం సమీపంలోని సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పాయకరావుపేట, తుని, నక్కపల్లి మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు గోపాలపట్నం గ్రామస్థులు అన్న సమారాధన నిర్వహించారు. పెద్దిపాలెం శివాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

మునగపాకలో..

మండలంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాల వద్ద దీపారాధనలు ఆధ్యాత్మిక వెలుగులు నింపాయి. మండలంలో మునగపాక, వాడ్రాపల్లి, టి.సిరసపల్లి, వెంకటాపురం, గవర్ల అనకాపల్లి తదితర గ్రామాల్లో కార్తీకమాసం వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్ల అనకాపల్లి కాశీవిశ్వేశ్వరస్వామిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. అన్నసమారాధనను సాయికృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్వీ రాజు, ఎంవీఆర్.నాయుడు, దాడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటరూరల్: సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు


అచ్యుతాపురంరూరల్: కొండకర్ల శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు

చేసిన పనులకు బిల్లు ఇప్పించండి

▸▸ కలెక్టర్‌కు పూడిమడక మాజీ ఉపసర్పంచ్ వినతి


కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అప్పారావు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పూడిమడక గ్రామంలో తాను చేసిన పనులకు బిల్లులను ఇవ్వకుండా పంచాయతీరాజ్ అధికారులు జాప్యం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ చోడిపిల్లి అప్పారావు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. పూడిమడక శివారు కడపాలెంలో గల పాత తుపాన్ రక్షిత భవనం, పూడిమడక పంచాయతీ భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతనంగా రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను నిర్మించడానికి రూ.45 లక్షలు కేటాయించడంతో శ్లాబ్ లెవెల్ వరకూ పూర్తి చేశామన్నారు. తమకు రావాల్సిన రూ.18 లక్షలు పంచాయతీరాజ్ ఏఈఈ, డీఈఈ ఆ మొత్తాన్ని సర్పంచ్ అక్కౌంట్‌లో వేయించారని, నాలుగేళ్లగా తనకు ఆమొత్తం అందలేదన్నారు. ఇందుకు బాధ్యులైన పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈఈలపై చర్యలు తీసుకుని తనకు బిల్లులు ఇప్పించాలని కోరారు. ఇదే ఫిర్యాదును సీఎం, డీసీఎంలకు పోస్టు ద్వారా పంపినట్టు తెలిపారు.

మత్స్యకారులకు ఉద్యోగాలివ్వాలి

పూడిమడకలో నిర్మించబోయే గ్రీన్ హైడ్రోజన్ ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌లో మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ మత్స్యకార నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులైన మత్స్యకారులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో మత్స్యకార నాయకులు వాసుపల్లి శ్రీనివాసరావు, చోడిపల్లి అప్పారావు, ఉమ్మిడి అప్పారావు, ఘైలపిల్లి పోలరాజు, ఉమ్మిడి జగన్ తదితరులు ఉన్నారు.

పట్టణంలో పెరిగిన పందుల సంచారం

▸▸ ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు, వాహనదారులు

▸▸ అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ఇటీవల పందుల సంచారం పెరిగింది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణ వీధుల్లో విచ్చలవిడిగా పందుల గుంపులు గుంపులుగా సంచరిస్తూ నివాస ప్రాంతాల్లోని వారితోపాటు వాహనదారులను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. యానాద్రి కాలువను ఆనుకుని ఉన్న ప్రాంతాలు పందులు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రధానంగా మిలట్రీ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, నాగేంద్రకాలనీ, ధర్మవరం, కాకివానివీధి, కొత్తపేట, కోర్టుపేట ప్రాంతాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. ఈ కారణంగా ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రితం పందుల సమస్యను నివారించిన మునిసిపల్ అధికారులు మరోసారి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కొత్తపేట ప్రధాన వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు



ఉపాధి పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల గ్రామసభ

ప్రశాంతంగా సామాజిక తనిఖీ గ్రామసభ

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోమవారం నక్కపల్లిలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. పది రోజులపాటు మండలంలోని 33 పంచాయతీల పరిధిలో చేపట్టిన 1,608 పనులకు సంబంధించి 2023-2024 మార్చి వరకూ చేపట్టిన రూ 23.47 కోట్ల పనులపై సంబంధిత అధికారులు నివేదికలను తెలియజేశారు. ఎంపీడీవో సీతారామరాజు అధ్యక్షతన నిర్వహించిన సోషల్ ఆడిట్ సభలో రాష్ట్ర పరిశీలకుడు నాగరాజు పాల్గొన్నారు. మండల స్థాయి అన్ని గ్రామాలకు సంబంధించిన నివేదికలను ఏపీవో భాగ్యలక్ష్మి తెలియజేశారు. మండలంలోని నెల్లిపూడి సహా మరికొన్ని గ్రామాల్లో ఒక చోట జరిగిన పనిని మరో చోట జరిగినట్టు చూపించినట్టు గుర్తించారు. మస్తర్లు నమోదు, వేతనాల చెల్లింపులో కూడా కొన్నిచోట్ల పొరపాట్లు జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు రూ80వేల వరకూ రికవరీ చేయాలని నిర్ణయించారు. పలువురు ప్రజాప్రతినిదులు అధికారులు పాల్గొన్నారు.

రేబాకలో సామూహిక కుంకుమ పూజలు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయం వద్ద కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు జి. శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. రేబాక, తిరుపతిపాలెం, రేవెళ్ల, రామాపురం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ముందుగా ముక్కంటికి రుద్రాభిషేకం చేశారు. తదుపరి సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరుకు చెందిన రాజాశ్రమ పీఠాధిపతి శ్రీ కృష్ణ చరణానంద భారతీస్వామి హాజరై భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో శోభారాణి, గురుభవానీ దవరసింగి రాంబాబు, విజయ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం


పోతులూరి వీరబ్రహ్మంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారాయుడుపాలెంలో కొలువైన జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారి సన్నిధిలో వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహక పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేవీ గేటు-వెంకటాపురం కొత్తరోడ్డు వేయాలి

▸▸ సీపీఎం నాయకుడు దేముడునాయుడు


అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దేముడునాయుడు

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలంలోని నేవీ గేటు నుంచి వెంకటాపురం వరకు కొత్తరోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్సెల్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవీ రోడ్డు పూర్తిగా గోతులమయమై శిథిలమైందన్నారు. ఈ రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము, దూళి పెరిగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, రోడ్డును ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. రోడ్డు పొడవునా భారీగా గొయ్యిలు ఏర్పడి, రాళ్లు తేలిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని దేముడునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆర్.గణేష్, సత్తిబాబు, ధర్మ, దోని, దేవి, అప్పారావు, కాశియ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రూరల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేత పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్నచోట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. చినషేకిళ్లపాలెం, పెద షేకిళ్లపాలెం, కొక్కిరాపల్లి, ఏటికొప్పాక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

మినుము, పెసర విత్తనాల పంపిణీ

ఎస్.రాయవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రబీ సీజన్‌లో రైతులకు కావలసిన పెసర, మినుము విత్తనాలను టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో సౌజన్య మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల్లో మినుము విత్తనాలు 40 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 29 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ నాయకులు తుంపాల నాగేశ్వరరావు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్, కురందాసు శ్రీనివాస్‌పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో తుప్పలు తొలగింపు


యర్రవరం శ్మశానవాటికలో పనులు జరుగుతున్న దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని యర్రవరం శ్మశాన వాటికలో ఎక్స్‌కవేటర్ సాయంతో తుప్పలు తొలగించి, పరిశుభ్రం చేశారు. గ్రామస్థుల సహకారంతో ఈ పనులు చేపట్టడం జరిగిందని మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీనివాస్ తెలిపారు. అలాగే శ్మశాన వాటికలో శివయ్య విగ్రహంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి, కొబ్బరి మొక్కలు పెంపకం చేపడతామన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

▸▸ నక్కపల్లి సీఐ కుమారస్వామి

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వల్ల అనేక దుష్పరిణామాలున్నాయని, దీనివల్ల భవిష్యత్తు నాశనమవుతుందని నక్కపల్లి సీఐ కుమారస్వామి చెప్పారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో కొన్ని మారుమూల గ్రామాల్లో సైతం యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, దీని వల్ల వారి భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎవరైనా సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా వుంచుతామని చెప్పారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామిని కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.



అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర, పరవాడ మండలం భరణికం శివాలయాల్లో శివునికి అభిషేకాలు

పరమశివునికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల/పరవాడ/సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శంభో శంకర అంటూ.. శివ నామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నాలుగు గంటల నుంచే బారులుతీరి స్వామిని దర్శించుకున్నారు. అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. తుమ్మపాలలో గల పురాతన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి విశేష అర్చనలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, మండల కేంద్రం పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయం, భరణికం, లేమర్తి, దేశపాత్రునిపాలెం, స్వయంభూవరం, దీపాంజలినగర్ తదితరాల్లో గల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా సబ్బవరం మండలంలోని దేవీపురంలో గల దక్షవటి, పైడివాడలోని స్వయంభూ నందీశ్వరస్వామి ఆలయం, గణపతిపురంలోని మల్లికార్జున స్వామి, వంగలి, లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయాలు, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, గొర్లివానిపాలెంలోని ఉమారామ లింగేశ్వ రస్వామి ఆలయం, పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, మొగలిపురంలోని విఘ్నే శ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.



సబ్బవరం మండలం దేవీపురం దక్షవటిలో స్వామివారికి పూజలు



తుమ్మపాలలో స్వామిని దర్శించుకుంటున్న పీలా గోవింద

నేరాల నియంత్రణ అందరి బాధ్యత : సీఐ రమణ

సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా భద్రత దృష్ట్యా వాణిజ్య, వస్త్ర దుకాణాలు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సబ్బవరం సీఐ పిన్నింటి రమణ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని కోరారు. అదే విధంగా గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే వారికి సమాచారాన్ని అందించినట్టు చెప్పారు. మండల కేంద్రం సబ్బవరంలో 250, గ్రామాల్లో సుమారు 120 దుకాణాలు, షాపులు గుర్తించామన్నారు. ఆయా యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివిధ పండుగలు, జాతరలు జరిగేటప్పుడు భారీగా భక్తజనం తరలి వస్తుంటారని, ప్రజా భద్రతకు రూ.20 వేలు వెచ్చిస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవచ్చునని వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ పి.సింహాచలం పాల్గొన్నారు..



సమావేశంలో పాల్గొన్న సీఐ, ఎస్ఐ

'మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారం'

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రచారాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి కోరారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. డిసెంబరు 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వెలుగు సిబ్బంది సభలు, సమావేశాలు, ర్యాలీలను రోజూ నిర్వహించి మహిళలను చైతన్యపరచాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దశల వారీగా షెడ్యూల్ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ డైసీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మామిడిపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మామిడిపాలెం సర్వే నంబర్ 120, 121లలో గల అంజినీ స్టోన్ క్రషర్స్ యాజమాన్యం గత ఐదేళ్లలో తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బంధువనంటూ అధికారులను లోబర్చుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎలాంటి రాయల్టీలు చెల్లించకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. గత ఐదేళ్లలో లక్షల టన్నుల రాయిని అక్రమంగా తరలించారన్నారు.

ఈ అంశానికి సంబంధించి గతంలో మైన్స్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. తక్షణమే అంజినీ స్టోన్ క్రషర్‌లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

▸▸ పరవాడ డీఎస్పీ సత్యనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. ఫార్మాసిటీ, లారస్ ఫార్మా పరిశ్రమ యూనిట్ 3లో ఫార్మా పరిశ్రమలకు ఉద్యోగులను విధులకు తీసుకువెళ్లి వచ్చే బస్సుల డ్రైవర్లతో సోమవారం ఇక్కడ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. విధిగా సీటుబెల్ట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపరాదని స్పష్టం చేశారు. ఈ సదస్సులో పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

» ప్రజలు అర్జీల ద్వారా తెలియజేయవచ్చు

» ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

» జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ రమణ



విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీ రమణ

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, జోన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కార్యాలయానికి అందించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సత్యనారాయణపురం వద్ద గల టిడ్కో గృహాలను పరిశీలించినట్టు చెప్పారు. మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకుంటామని వివరించారు. టిడ్కో గృహాల్లో ప్రస్తుతం జీవనం సాగిస్తున్న వారి వివరాలను పరిశీలించామని చెప్పారు. అయితే ఒకే ఇల్లు ఇద్దరికి రిజిస్ట్రేషన్ జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. మొత్తం 2744 గృహాల్లో 102 వరకు ఖాళీగా ఉన్నాయని, వాటిని నిజమైన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని వివరించారు. గొలగాం, కోడూరు తదితర ప్రాంతాల్లోని జగనన్న లే అవుట్‌లలో ఇసుక, వాటర్ సమస్య ఉందని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే ఇంటింటి సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లి జోన్‌లో 30 వేల కుటుంబాలు ఉన్నాయని, 19వేల కుటుంబాల వివరాలను అధికారులు సర్వే చేసి సిద్ధం చేశారన్నారు. మరో 11వేల మంది సర్వేలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. సర్వేలో రిజిస్ట్రేషన్ అయి ఉంటే ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను తీసేస్తారనే అపోహలు వీడాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా సర్వే పూర్తి చేయనున్నామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

» క్వారీల నిర్వాహకులకు డీఎస్పీ శ్రావణి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని క్వారీ రంగ ప్రతినిధులకు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. ఇక్కడి పోలీస్ అతిథిగృహం సమావేశ మందిరంలో క్వారీల నిర్వాహకులతో సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. క్వారీ వాహనాలకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయాలైన ఉదయం ఏడు నుంచి పది గంటలు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు పట్టణ పరిధిలో ప్రవేశం లేదన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తులకు నష్టం జరగకుండా క్వారీల్లో బ్లాస్టింగ్‌లు చేయాలన్నారు. పేలుడు పదార్థాలు సంఘ వ్యతిరేక శక్తుల వద్దకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరి వద్దనైనా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నప్పుడు క్వారీ యాజమాన్యం పాత్ర ఉన్నట్లు నిర్ధారణ జరిగితే చట్ట ప్రకారం అటువంటి వారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ ఎంవీ నారాయణ, అనకాపల్లి రూరల్ అశోక్‌కుమార్, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, అనకాపల్లి రూరల్, మాడుగుల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కన్నూరుపాలెం- తాళ్లపాలెం రోడ్డు మరమ్మతు ప్రారంభం



కన్నూరుపాలెం వద్ద మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న కూటమి నేతలు

కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరుపాలెం- తాళ్లపాలెం రోడ్డు మరమ్మతు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు తొలుత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రూ.పది లక్షలు మంజూరు చేశారన్నారు. కూటమి పాలనలోనే పల్లెల అభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ ఎంపీపీ కూండ్రపు రామునాయుడు, కూటమి నాయకులు కన్నూరు ఎర్రినాయుడు, చుక్క ప్రసాద్, కన్నూరు వాసు, నరసింహనాయుడు, కర్రి సత్యనారాయణ, సిదిరెడ్డి సూర్యనారాయణ, కలగ గోవింద, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లను చేర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకుడు గణేశ్

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా ఇప్పటికే వచ్చాయని, ఇంకా ఎవరైనా నమోదు చేయించుకోనివారు ఉంటే డిసెంబరు తొమ్మిదో తేదీలోగా రెండో విడత నమోదు చేసుకోవచ్చునని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొణతాల గణేశ్ తెలిపారు. స్థానిక నరసింగరావుపేటలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులంతా పాకలపాటి రఘువర్మను రెండోసారి ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు వై.శ్రీనివాస్, డి.నూకేష్, సీహెచ్.కిరిటీ, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి ఆర్చరీకి క్రీడాకారుల ఎంపిక

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు మంగళవారం స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు ఆసక్తి గల క్రీడాకారులు ఫొటో, ఆధార్, జనన ధ్రువపత్రాలతో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న విస్తరణాధికారి ధర్మారావు

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పై కార్యదర్శులంతా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ విస్తరణాధికారి కె. ధర్మారావు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల పై దృష్టి సారించాలని వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు.

ఎక్కడి పనులు అక్కడే!

తుమ్మపాలలో పడకేసిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు



శ్లాబ్ స్థాయిలో ఆగిపోయిన వెలెనెస్ సెంటర్ భవనం



ఇరుకు గదిలో సచివాలయ సిబ్బంది విధులు



అరవై శాతం పనులు జరిగి అర్ధంతరంగా నిలిచిన సచివాలయం-2 భవనం

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ప్రభుత్వ భవన నిర్మాణాలు పడకేశాయి. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఆయా పనులపై కార్యాలయాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల సైతం ఇరుకు భవనాలలో ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో తుమ్మపాలకు మూడు సచివాలయాలు, మూడు రైతు భరోసా కేంద్రాలు, మూడు వెలెనెస్ సెంటర్లు, ఒక డిజిటల్ గ్రంథాలయం మంజూరయ్యాయి. అయితే వీటికి సంబంధించి భవనాల నిర్మాణానికి తుమ్మపాలలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కేవలం రెండు



పిల్లర్ల దశలో రైతు భరోసా కేంద్ర భంనం

సచివాలయ భవనాలు, ఒక రైతు భరోసా కేంద్రం, ఒక వెలెనెస్ సెంటర్‌లకు మాత్రమే భవనాల నిర్మాణానికి అధికారులు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు. దాదాపు నాలుగేళ్ల క్రితం రూ.35 లక్షలతో సచివాలయం-1 భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా తొంభై శాతం పనులు పూర్తయినప్పటికీ మైనర్ వర్క్స్ పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో సిబ్బంది పాత పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. రూ. 40 లక్షల వ్యయంతో ప్రారంభమైన సచివాలయం -2భవన నిర్మాణ పనులు అరవై శాతం పూర్తి కాగా మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అలాగే రూ.21.8 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో వెల్నెస్ సెంటర్ భవనాల పనులు ప్రారంభమైనా పిల్లర్లు, శ్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయాయి. ఈ కారణంగా ఒక వైపు సచివాలయాలకు, రైతు భరోసా కేంద్రాలకు ఆయా పనులపై వచ్చేవారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సామాజిక భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న ఈ కార్యాలయాల ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు. గతంలో టెండర్లు పాడుకుని పనులు ప్రారంభించిన కొందరు వైసీపీ నాయకులు ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పనులు పూర్తిచేసి భవనాలు అప్పగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అధికారుల సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే లక్షలాది రూపాయల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగినప్పటికీ మిగిలిన పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలావుంటే, నిర్మాణ దశలో నిలిచిపోయిన భవనాలు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. అలాగే భవనాల చుట్టూ తుప్పలు, చెత్తా చెదారం పేరుకుపోతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఈ భవనాలను పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకు రావాలని పంచాయతీ ప్రజలంతా కోరుతున్నారు.

పనులు ప్రారంభమయ్యేలా చర్యలు



తుమ్మపాలలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా ఆదేశిస్తాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలకు సైతం ఉపక్రమిస్తాం. స్థానికంగా ఉండే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా భవనాలను అందుబాటులోకి తీసుకువస్తాం. ఈ అంశాలకు సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

- కేవీ నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి

ఈవీఎంల గోదాం పరిశీలించిన కలెక్టర్

» భద్రత విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు



గోదాంను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

అనకాపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాంను కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, గోదాం ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లు తదితరాలపై ఆరా తీశారు. భద్రత విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఆర్వో దయానిధి, ఆర్డీవో షేక్ ఆయిషా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా భరోసా

» పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం పొందడం ద్వారా బలం, బీమా భరోసా లభిస్తుందని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ తెలిపారు. పరవాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదుపై ద్వితీయశ్రేణి నాయకులు దృష్టి సారించాలన్నారు. సభ్యత్వం పొందినవారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.ఐదు లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా మృతుని పిల్లల చదువు బాధ్యతను పార్టీ చూసుకుంటుందని వివరించారు. సభ్యత్వ నమోదులో పరవాడ మండలం వెనుకబడి ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. అనంతరం ఇటీవల ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా పరవాడ వచ్చిన బాబ్జీని పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు రాయవరపు దేముడు, ఇందల కొండలరావు, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, బొండా తాతారావు, బంగార్రాజు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రవల్లికకు పతకం



పతకాలతో ప్రవల్లిక

అనకాపల్లి టౌన్, నవం బరు 25 (ఆంధ్ర జ్యోతి) : తమిళనాడు రాష్ట్రం శేలం రైల్వే గ్రౌండ్స్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఎస్ఎస్ఎస్ సేవా సంఘం జిమ్‌కు చెందిన కె.ధారిశెట్టి ప్రవల్లిక రజత పతక సాధించింది. 84 కిలోల బాలికల జూనియర్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఈమె స్క్వాట్, బెంచ్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో 330 కిలోల బరువు ఎత్తి రజిత పతకాన్ని సొంతం చేసుకుందని జిమ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా విజేతను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలా, బద్రీనాథ్, కోశాధికారి అజయ్ అభినందించారు.

'సైబర్ నేరాల కట్టడికి చర్యలు చేపట్టండి'



ఎస్పీ తుహిన్ సిన్హాకు మొక్క అందిస్తున్న సరేంద్ర

అనకాపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి) : గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను కలిశారు. ప్రస్తు తం విద్యార్థులు, ప్రజలు సైబర్ నేరాలకు గురవుతున్నారని వివరించారు. విద్యా సంస్థల్లో పోలీస్ బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంతమేర మోసాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

రోగులకు బెడ్‌షీట్లు, పండ్లు పంపిణీ

కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం పీహెచ్‌సీలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు సోమవారం రోగులకు బెడ్‌షీట్లు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ తిరుపతిరావు, కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

29 వరకూ ఆధార్ సేవలు కొనసాగింపు

సబ్బవరం, నవంబరు 25 : ఆధార్ సేవలను ఈ నెల 29వ తేదీ వరకూ కొనసాగిస్తున్నామని ఎంపీడీవో పి. పద్మజ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో, గొటివాడ సచివాలయంలో, 27న ప్రభుత్వ జూనియర్ కళాశాల, గుల్లేపల్లి అక్షర పబ్లిక్ స్కూల్‌లో, 28న జెడ్పీహెచ్ఎస్ తవ్వవానిపాలెం, సబ్బవరం డీఎంకే కళాశాలలో, 29న సబ్బవరం ఆర్కిడ్ స్కూల్, రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద ఈ సేవలు అందనున్నాయన్నారు.

'భూములు తీసుకోవాలని చూస్తే సహించం'

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్ పేరిట భూములు తీసుకోవాలని చూస్తే హైకోర్టు ధిక్కారంపై ఫిర్యాదు చేస్తామని సీపీఎం నేతలు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పది మండలాల పరిధిలో 54 గ్రామాల్లో భారీగా భూ సేకరణ చేయడానికి గ్రామసభలు నిర్వహించారన్నారు. ఆ గ్రామ సభలు సందర్భంగా రైతులు, చిన్న, సన్నకార రైతులు కూలీలు, వృత్తిదారులు, భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పారన్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల యంత్రాలు పెట్టి భూముల్లో ఉన్న పంటలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. కాగా కొంత మంది స్వచ్ఛందంగా భూములు ఇస్తామన్న వారికి ఉడా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని చెప్పారన్నారు. అవి నేటికీ అభివృద్ధి చేసి ఇవ్వలేదన్నారు. ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం జరగకుండా భూములను సేకరించవద్దని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు తేలయ్యబాబు, గోవింద, జి.సుభాషిణి, సిగిరెడ్డి వెంకటేశ్వరరావు, బండి దుర్గారావు, గేన రాజు, పిల్లా సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా మీనాక్షి సుందరేశ్వర కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవంలో రత్నాకర్ తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అగ్గిమర్రిచెట్టు వద్ద గల గౌరీ పరమేశ్వరుల ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా కొణతాల అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో మీనాక్షి సుందరేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే 216 మంది దంపతులు ఈ కల్యాణంలో కూర్చొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీలా శ్రీను, కాండ్రేగుల వెంకట సూరి, కాండ్రేగుల ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర ఆలయానికి వెండి నాగాభరణం వితరణ



కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో ఉన్న భువనేశ్వరి సహిత బసవేశ్వర స్వామికి వెండి నాగాభరణాన్ని వితరణగా సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన బండారు రామ, రమాదేవి దంపతులు రూ. రెండులక్షలు వెచ్చించి దీనిని తయారు చేయించారు. అర్చకులు సుబ్రహ్మణ్యశర్మకు అందజేసిన అనంతరం ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు.

'దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు, జరిమానా'

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. పది వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి తీర్పు చెప్పినట్టు పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని తానాం గ్రామానికి చెందిన పైలా గణపతిని అదే గ్రామానికి చెందిన ఈరుగుల సూరి అప్పారావు 2018, నవంబరు 21వ తేదీ రాత్రి తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. అదే రోజు క్షతగాత్రుడు పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై అప్పటి సీఐ బి.సీహెచ్.స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి ఎస్ఐ గోపి ఈ కేసుపై అనకాపల్లి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, అనకాపల్లి ఏపీపీ మృణాళిని కోర్టులో వాదనలను వినిపించారు. వీటిని విన్న జడ్జి సూరిఅప్పారావుకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించినట్టు సీఐ చెప్పారు.

గొల్లలపాలెంలో గెడ్డవాగు ఆక్రమణకు అడ్డుకట్ట



గెడ్డవాగులో ఎక్సకవేటర్‌తో ట్రెంచ్ తవ్వుతున్న దృశ్యం

సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెంలో గెడ్డవాగు ఆక్రమణకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. గొల్లపాలెం సర్వే నెంబరు 219లో గెడ్డవాగు/పోరంబోకు భూమి ఉంది. సదరు భూమికి ఎగువన గల జిరాయితీలో ఒకరు లే-అవుట్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ లే-అవుట్‌కు ప్రధాన రహదారిగా ఉన్న గెడ్డవాగును ఆక్రమించి, సదరు స్థలంలో నుంచి లే-అవుట్‌కు ఇటీవల గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఐ వీరయ్య సిబ్బదితో సోమవారం వెళ్లి పరిశీలించారు. ఎక్సకవేటర్ సాయంతో సదరు ప్రదేశంలో ట్రెంచ్‌ను తవ్వారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గెడ్డవాగును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బకాయిల కోసం కార్మికులు ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి వారంతా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలు నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్నటువంటి పేద వర్గాలవారు ప్రభుత్వ సంస్థల్లో అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు జీవనం సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ నిర్వహణకు కార్మికులకు పరికరాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సంస్థల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శివలక్ష్మి, పి.జానకి, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఎం.లక్ష్మీ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.













డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన స్కూల్ సేఫ్టీ కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ టీం కమాండర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 27వ తేదీ వరకు కోస్తా తీర ప్రాంత మండల గ్రామాల్లో పాఠశాలలు, పరిశ్రమల్లో డిజాస్టర్ మేనేజిమెంట్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, విపత్తు నివారణ, నిర్వహణపై చేయకూడనివి, ఉరుములు, మెరుపులు, దుమ్ము, వడగండ్ల వాన, కుంభవృష్టి, బలమైన గాలులు వీచునపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.సత్యనారాయణ, ఎంఈఓ-2 జి.రమేష్, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ టి.త్రినాథ్, పోలీస్, అగ్నిమాపక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

కష్టంలో ఉన్న మిత్రుడిని ఆదుకున్న దేవవరం యువకులు

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కష్టంలో వున్న స్నేహితుడిని ఆదుకోవడంలో మేమున్నామని మండలంలోని దేవవరం యువకులు, మానవతావాదులు నిరూపించుకున్నారు. ఈ గ్రామానికి చెందిన కక్కల అజిత్‌కుమార్ పది రోజుల క్రితం పొట్టపోషణ కోసం బెంగళూరు ట్రైన్‌లో బయల్దేరాడు. ఆ రైలు రాజమండ్రి చేరుకోగానే భోగీ మారేందుకు కిందకు దిగి మరో భోగీలోకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తూ రైలు చక్రాల కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న ప్రయాణికులు అజిత్‌కుమార్‌ను కాపాడి రాజమండ్రి రైల్వే ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం నుజ్జునుజ్జయిన కాలును తొలగించారు. అజిత్ కుమార్ గీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా వుండేవాడు. కాలు తొలగించడంతో కూలి పనికి వెళ్లలేక ఇంటి వద్దే దీనావస్థలో వున్నాడు. అజిత్ కుమార్ పరిస్థితిని తెలుసుకున్న దేవవరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు రూ.16 వేలు ఆర్థిక సాయం, తుని స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేసి ఉదారతను చాటుకున్నారు.


స్నేహితుడికి సాయమందిస్తున్న యువకులు

దాతల భాగస్వామ్యంతోనే ఆలయాల అభివృద్ధి

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి దాతల భాగస్వామ్యంతోనే జరుగుతుండడం గొప్ప పరిణామమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. మండలంలోని ఉపమాక శివాలయంలో నాలుగు సోమవారాలు అన్నదానం, ఆలయ అభివృద్ధికి సహకరించి, భారీ విరాళాలు ఇచ్చిన పలువురు దాతలను సోమవారం మధ్యాహ్నం పలు పార్టీల నాయకులు ఘనంగా సత్కరించారు. ఉపమాక శివాలయంలో ఈ ఏడాది అన్ని కార్యక్రమాలు ఘనంగా చేపట్టడంలో కీలకపాత్ర పోషించిన దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి సేవలను పలువురు ప్రశంసించారు.


శివాలయం అర్చకుడు మహేశ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పోస్టల్ స్టాంపులు, నాణాల ప్రదర్శన

ఎస్.రాయవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగరాజుపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగే జాతీయ రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం వివిధ దేశాల పోస్టల్ స్టాంపులు, నాణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఇన్‌చార్జి ఎంఈవో సత్తిబాబు, గోపిరాజు ప్రారంభించారు. ఈ నాణాలు, స్టాంపులను సేకరించిన అనకాపల్లికి చెందిన ఫిలటెలిస్ట్ మజ్జిల రాజాజీను అక్కడికి వచ్చిన వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషన్ శ్రీధర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జి మేఘప్రసాద్, గణపతిరాజు, సోమరాజు, కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి గ్రామంలో రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సోమవారం శివ, పార్వతి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. గాజువాక వుడా కాలనీకి చెందిన భీశెట్టి మహలక్ష్మినాయుడు, లక్ష్మి దంపతులు సారథ్యంలో సుమారు 15 మంది భక్తులు కలిసి 4 తులాల బంగార కాసుల హారాన్ని పార్వతిదేవికి కానుక ఇచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలు, సారె ఊరేగించారు.

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తామని ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రెవెన్యూ పరమైన అర్జీలు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయంటూ ఒక అర్జీ వచ్చిందని ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారం'

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రచారాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి కోరారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. డిసెంబరు 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వెలుగు సిబ్బంది సభలు, సమావేశాలు, ర్యాలీలను రోజూ నిర్వహించి మహిళలను చైతన్యపరచాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దశల వారీగా షెడ్యూల్ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.


అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మామిడిపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మామిడిపాలెం సర్వే నంబర్ 120, 121లలో గల అంజినీ స్టోన్ క్రషర్స్ యాజమాన్యం గత ఐదేళ్లలో తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బంధువునంటూ అధికారులను లోబర్చుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎలాంటి రాయల్టీలు చెల్లించకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. గత ఐదేళ్లలో లక్షల టన్నుల రాయిని అక్రమంగా తరలించారన్నారు. ఈ అంశానికి సంబంధించి గతంలో మైన్స్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. తక్షణమే అంజినీ స్టోన్ క్రషర్‌లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

పురవీధుల్లో సాంబమూర్తి ఊరేగింపు


మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శతాబ్దాల చరిత్ర కలిగిన సాంబమూర్తి దేవుడిని సోమవారం పురవీధుల్లో ఊరేగించారు. ఏటా కార్తీకమాసం ఆఖరి సోమవారం శివ, పార్వతి ఉత్సవ విగ్రహాలను ఆనవాయితీగా ఊరేగింపు నిర్వహిస్తారు. దానికి అనుగుణంగానే రంగు రంగుల నూలు ధారాలు, వస్త్రాలతో తయారు చేసిన గుమ్మటంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.











ప్రజా రవాణాను మరింత మెరుగుపరచాలి

» ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొరకు ఎంవీవీ ప్రసాద్ వినతి


దొన్నుదొరను అభినందిస్తున్న ఎంవీవీ ప్రసాద్, తదితరులు

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేలా మండలానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, మాజీ ఎంపీపీ జి. సత్యనారాయణ కోరారు. సోమవారం ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దొన్నుదొరను కలిసి అభినందనలు తెలిపారు. మండల కేంద్రం నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, పాడేరుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రవేశపెట్టాలని, అలాగే మారుమూల బూదరాళ్ల, మంప, యు. చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీ పరిధిలో గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దొన్నుదొరను కలిసిన వారిలో టీడీపీ నేతలు కొర్రు రామ్మూర్తి, వరహాలబాబు, ఉల్లి వెంకటేశ్వర్లు, స్వామినాయుడు ఉన్నారు.

చెరుకుంపాకలులో వేదపాఠశాల ఏర్పాటు


చెరుకుంపాకలులో హోమం చేస్తున్న భక్తులు

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుంపాకలు గ్రామంలో వేదపాఠశాలను ప్రారంభించారు. సోమవారం అధ్యాత్మిక గురువు ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది దంపతులతో ప్రత్యేక హోమం జరిపించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ గిరిజనుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు వేదాలను యువతకు నేర్పించాలని వేదపాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యర్రవరం జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యర్రవరం జలపాతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని గొందిపాకలు సర్పంచ్ సాగిన వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. సోమవారం సర్పంచ్‌తోపాటు కూటమి నాయకులు జలపాతం వద్ద శ్రమదానం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ యర్రవరం జలపాతానికి కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారన్నారు. పర్యాటకుల కోసం జలపాతం వద్ద కనీస సదుపాయాలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి యర్రవరం జలపాతం వద్ద పర్యాటకుల కోసం కనీస సదుపాయాలు కల్పించాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడుకి తీవ్రగాయాలు

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తున్న యువకుడుకు విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం అంతర్ల గ్రామానికి చెందిన కవడం కృష్ణ విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మసీదు వీధిలో ఓ గృహానికి చెందిన సర్వీసు వైర్‌ను విద్యుత్ స్తంభంపై కలుపుతుండగా విద్యుత్ సరఫరా జరగడంతో కిందకు పడిపోయాడు. దీంతో తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి రమేశ్ ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కి తరలించారు. బాధితుడు ఆరోగ్య పరిస్థితి నిలకడగా వున్నదని వైద్యాధికారి తెలిపారు.

సీకుపనసలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ విమలమ్మ

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనాడ పంచాయతీ సీకుపనస గ్రామంలో సీసీ రోడ్డుకు సర్పంచ్ జీరుగుబోయిన విమలమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రూ.5 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు వేయిస్తున్నట్టు చెప్పారు. పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో ప్రతీ గ్రామానికి అత్యవసర సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తూపూరు ఎర్రయ్యమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలి

గూడెంకొత్తవీధి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించాలని స్థానిక ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికి పని కల్పించాలన్నారు. ప్రతి కూలీ వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూములు కలిగిన కూలీలకు 150 పనిదినాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈపీవో రామప్రసాద్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

సీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మన్యం శరిమలైగా పేరుగాంచిన సీలేరు అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ అర్చక గురువులు గురుస్వామి కోన వెంకటశివకళ్యాణ్ ఆధ్వర్యంలో పడిపూజను నిర్వహించారు. ఉదయం అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, తిరుఆభరణ శోభాయాత్ర, అభిషేకాలు, గణపతి హోమం, మహా నివేదన వంటి పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆవాహిత పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డొంకరాయి, మోతుగూడెం, ఒడిశా చిత్రకొండ, బలిమెల, మల్కన్‌గిరి, కలిమెల ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్పస్వామి శరణు ఘోషతో ఆలయం మార్మోగింది.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


కొత్తవలస బాలురు పాఠశాలలో మెనూ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతికి వెళ్లి విద్యార్థులకు పాఠాలను బోధించారు. అలాగే సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వండిపెడుతున్న భోజన మెనూ పరిశీలించారు. నాణ్యమైన విద్య బోధించడంతో పాటు మెనూ పక్కాగా అమలు చేయాలని సూచించారు.

ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ తప్పనిసరి : ఐటీడీఏ పీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన టీడబ్ల్యు డీడీ ఎల్.రజనీ

పాడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమెటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ తప్పనిసరిగా ఉండాలని, అందుకు విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖాధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి విద్యార్థి ఆధార్ నంబర్‌లోని వివరాలు, పాఠశాలల్లోని రిజిస్టర్లలోని వివరాలు సరిపోలి ఉండాలన్నారు. సక్రమంగా ఉన్న అన్ని వివరాలను అపార్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే అపార్ నంబర్ కేటాయించబడుతుందన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఇంకా 27 వేల మంది విద్యార్థులకు అపార్ నమోదు కావాల్సి ఉందని, అందుకు గాను అవసరమైన సవరణలు చేపట్టి ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజనీ, ఏటీడబ్ల్యూవోలు స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తీగలమెట్ట రోడ్డుకు మోక్షం

» రూ.40 లక్షలతో బీటీ రోడ్డు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్టు


మెటల్ రోడ్డు మందంను పరిశీలిస్తున్న దృశ్యం

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగలమెట్ట రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. బీటీ రోడ్డు నిర్మాణాన్ని రూ.40 లక్షలతో చేపట్టనున్నారు. 'తీగలమెట్ట రోడ్డుకు మోక్షమెన్నడో' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టరు, ఐటీడీఏ పీవో స్పందించారు. ఈ రహదారిని తక్షణం పూర్తిచేయాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం ఇంజనీరింగ్ సిబ్బంది నాలుగేళ్ల క్రితం ఉపాధి హామీ నిధులతో వేసిన మెటల్‌పై బీటీ రోడ్డు వేసేందుకు అనువుగా ఉన్నదీ? లేనిదీ? పరిశీలించారు. మెటల్ రోడ్డు మందాన్ని పరిశీలించారు. బీటీ రోడ్డు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. తమ గ్రామానికి బీటీ రోడ్డు వేస్తుండడంతో తీగలమెట్ట వాసులు హర్షం వ్యక్తం చేస్తూ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు


పాడేరురూరల్: సంగోడిలో శివ దర్శనానికి క్యూకట్టిన భక్తులు


చింతపల్లి: బౌడ శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


సీలేరు శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాల్గో సోమవారం మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయం, పాత పాడేరులోని స్వయంభూ గౌరీ నీలకంఠేశ్వరుని ఆలయం, త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయాలు సోమవారం ఉదయం 5 గంటల నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రాము శివుడికి పూజలను చేపట్టారు. భక్తులకు ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్న సమారాధనను మాజీ ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, పాడేరు పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ప్రారంభించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు సాధువులు, పేదలకు వస్త్రదానం చేపట్టారు. మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో పార్వతీ సమేత సిద్ధి సంగమేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

కొయ్యూరులో..

కార్తీక మాసం నాలుగో సోమవారం మండలంలోని పలు శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. కొయ్యూరు మల్లికార్జునస్వామి ఆలయం, మాల మాకవరంలోని శివాలయం, వలసంపేట సమీప గాదిగుమ్మిలో వెలసిన గిరిజా సమేత తాండవేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు శైవ క్షేత్రాలకు తెల్లవారు జాము నుంచే భక్తుల తాకిడి పెరిగింది. కొయ్యూరు ఆలయం వద్ద అనిశెట్టి చిరంజీవి, ఆలయ ప్రధానార్చకులు శర్మ, సర్పంచ్ బాలరాజు, బీజేపీ నేత మేడిబోయిన చిన్న, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం. అశోక్ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే మాల మాకవరంలో కూడా చినతల్లి, రాజబాబు, పచ్చిపులును నరసయ్యల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గాదిగుమ్మి గిరిజ సమేత తాండవేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు చేరుకుని ధ్వజ స్తంభాల వద్ద దీపాలను వెలిగించి, పూజలను నిర్వహించారు. సాయంత్రం శివాలయం, మారెమ్మ ఆలయాల్లో ఆకాశ దీపం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చింతపల్లిలో..

మండలంలోని నాలుగో కార్తీక సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అంతర్ల, బౌడ శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచే ఆలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. బౌడ శివాలయంలో అర్చకుడు ఈ.నగేశ్‌కుమార్ భక్తులతో అభిషేకాలు, కుంకుమార్చనలు చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

» సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అనంతగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూముల జోలికివస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షత సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రధానమైన సమస్యలు, విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అధికారిక కార్యక్రమాలకు, శంకుస్థాపనలకు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గౌరవం ఇచ్చి పుచ్చుకునేలా ఉండాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు మంచిచేద్దామన్నారు. నాన్ షెడ్యూల్డ్ పంచాయతీల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాకు పాల్పడేవారిపై చర్యలు చేపట్టాలని, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, తహసీల్దార్ వి.మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీ.కుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో ఉదయం దట్టంగా కమ్ముకున్న మంచు

గజగజలాడిస్తున్న చలిపులి

ముంచంగిపుట్టు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలిపులి ప్రజలను గజగజలాడిస్తున్నాయి. మండల కేంద్రంలో సోమవారం ఉదయం పది గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంది. మంచు ఎక్కువగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వస్తేగానీ గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పట్టపగలు లైట్ల వెలుగులో వాహన రాకపోకలు సాగించారు. సాయంత్రం నాలుగు గంటలు దాటితే చాలు చలి మొదలవుతుంది. చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలిమంటలు కాగుతున్నారు. ఒక్కసారిగా చలి పెరగడంతో పిల్లలు, పెద్దలు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థినులకు దోమతెరల పంపిణీ

అనంతగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు సోమవారం దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ అన్ని పాఠశాలల విద్యార్థులకు దోమతెరలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నరసింగరావు, సీఆర్పీ సమూయేలు పాల్గొన్నారు.

వారపు సంతలో మత్తు పదార్థాలపై కళాజాత

పెదబయలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు పదారాజివిలకు దూరంగ ఉండాలని వారపు సంతల్లో సోమవారం కళాజాత నిర్వహించారు. పెదబయలు, రూడకోట, జామిగూడ, గోమంగి, పెదకోడపల్లి సంతల్లో గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను గిరిజనులకు అవగాహన కల్పించారు. గిరిజన యువలకు చెడు వ్యసనాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా ఎస్ఐ రమణ సూచించారు.

ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేస్తాం

» ఎంపీడీవో ఏవీవీ.కుమార్

అనంతగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేస్తామని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం వారపు సంత వద్ద వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 1 నుంచి ప్లాస్టిక్ నిషేధిస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే బుధవారం కాశీపట్నం, డముకు వారపు సంతలు, గుమ్మకోట మంగళవారం వారపు సంతల వ్యాపారులు ఈ విషయం గమనించాలని సూచించారు. జ్యూట్‌తో తయారుచేసిన సంచులను వినియోగించాలని చెప్పారు. నిషేధించిన తరువాత ప్లాస్టిక్ వాడితే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవా, సచివాలయం ఉద్యోగులు గీత, వసంత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై వారపు సంతలో ప్రచారం


ప్లాస్టిక్‌ను నిషేధంపై వారపు సతలో ప్రచారం చేస్తున్న అధికారులు

పెదబయలు, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని వారపు సంతలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ జి.రంగారావు పంచాయతీ అధికారులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. జీవ మనుగడకు ప్లాస్టిక్ చేసే అవాంతరాలపై మైక్ ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల వాతవరణం తీవ్రంగా దెబ్బతింటుందని చెప్పారు. అందువల్ల వర్తకులు ప్లాస్టిక్ కవర్లను నిలిపి వేయాలని సూచించారు. వాటి స్థానంలో గుడ్డ సంచులు, పేపర్ సంచులు వాడాలని ఆదేశించారు. ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు, జరిమానా తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి నరసింగరావు పాల్గొన్నారు.

30న పింఛన్ల పంపిణీ

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఈనెల 30వ తేదీనే గ్రామాలలో పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్టు ఎంపీడీవో ఎస్‌కేపీ ప్రసాద్ తెలిపారు. డిసెంబరు 1 ఆదివారం కావడంతో ఒక్కరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

టీడీపీ అత్యవసర సమావేశం రేపు

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఈనెల 27వ తేదీన జిల్లా పరిషత్ అతిథి గృహ ఆవరణలో తెలుగుదేశం పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు తెలిపారు. పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి నాయకులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని దొరబాబు కోరారు.

పంటల బీమాపై అవగాహన

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగపరుచుకునేలా చైతన్యపరచాలని మండల వ్యవసాయశాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. సోమవారం రావణాపల్లి రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్‌పై అవగాహన కల్పించారు. రాజ్‌మా పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందన్నారు. రాజ్‌మా సాగు చేసే రైతు ఎకరానికి రూ.300 చెల్లించి బీమా చేసుకుంటే పంటకు నష్టం వాటిల్లితే రూ.20 వేలు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, ఎంపీఈవో, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

కాకనూరులో 98 మందికి వైద్య పరీక్షలు


కాకనూరులో మహిళను పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ధారకొండ వైద్యాధికారి హిమబిందు అన్నారు. సోమవారం గుమ్మిరేవుల పంచాయతీ కాకనూరులో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 98 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై నడవలేని స్థితిలో ఉన్న మహిళను ధారకొండ పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోవకుమారి, ఏఎన్ఎం మత్స్యకొండ, సీత పాల్గొన్నారు.

విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చింతలపూడిలో సోమవారం విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో చిన్ని నూకరాజు పూరిల్లు దగ్ధమై, రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. సోమవారం సాయంత్రం విద్యుత్ మీటరు నుంచి మంటలు చెలరేగి ప్రమాదం సంభవించినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు. గ్రామస్థులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో దాచిన కొద్దిపాటి నగదు, విలువైన గృహోపకరణాలు, తిండి గింజలు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా భీమ్‌నాయుడు


ఎమ్మెల్సీ రఘువర్మ నుంచి అవార్డు అందుకుంటున్న భీమ్‌నాయుడు

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంఘిక శాస్త్ర దినోత్సవాల్లో అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వన్నెపూరి భీమ్‌నాయుడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు తీసుకున్న భీమ్‌నాయుడు సోమవారం పాఠశాలకు హాజరు కావడంతో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్, సహోపాధ్యాయులు కెజే.రామారావు, ప్రసాదరావు, దిలీప్‌కుమార్, కొండబాబు, కేశవరావు, కేశవ, అరుణ, గంగాభవాని, మహేశ్వరి, పుణ్యవతి, సత్యవతి, స్కూల్ కమిటీ చైర్మన్ వంతాల కోటేశ్వరరావు సత్కరించారు.

శివాలయం వీధిలో డ్రైనేజీ ప్రారంభం


డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభించిన సర్పంచ్ ఉషారాణి

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వీధిలో కొత్తగా నిర్మించిన డ్రైనేజీని సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి సోమవారం ప్రారంభించారు. దుర్గంధం నుంచి విముక్తి కలిగించిన సర్పంచ్‌కు వీధి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వార్డు సభ్యులు గోపాలకృష్ణ, కె.రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కొట్టగుళ్లి రామారావు, యూవీ.రత్నం, ఎస్.కొండలరావు, ఎస్.శ్రీనివాస్‌కుమార్, బి.ముకుందరావు, నానాజీ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు

» అరకులోయ సీఐ హిమగిరి

అరకులోయ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తప్పవని అరకులోయ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.హిమగిరి హెచ్చరించారు. అరకులోయలోని పలు ప్రధాన రహదారులను సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ స్టాపర్లను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. మద్యం తాగినా, ఓవర్ లోడుతో వాహనం నడిపినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారి భద్రతలో భాగంగా అరకు-విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిలోని ట్రైబల్ మ్యూజియం, అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్, బురదగెడ్డ, అల్ఫాగ్రేస్ హోటల్, రవ్వలగుడ ఐటీడీఏ పెట్రోల్‌బంక్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిని వాహన చోదకులు గమనించాలని సీఐ సూచించారు.

గురుకుల కళాశాలలో సమస్యల తాండవం

మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఉన్న సౌకర్యాలు మూలకు చేరాయి. ఫలితంగా విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునే నాథులే లేకపోయారు.

- మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్
- డార్మెటరీలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పాడైన మరుగుదొడ్లు, కిటికీల తలుపులు
- ట్యాపులు లేని తాగునీటి పైపులైన్లు
- విద్యార్థుల ఇక్కట్లు.. పట్టించుకోని అధికారులు

గొలుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఐదో నుంచి ఇంటర్ వరకూ 570 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల వసతి కోసం డార్మెటరీలో 12 గదులు ఏర్పాటు చేశారు. ఈ గదులకు ప్రస్తుతం కిటికీలు, మరుగుదొడ్ల తలుపులు మరమ్మతులకు గురయ్యాయి. తాండవ రిజర్వాయర్ దగ్గరగా ఉండడంతో కిటికీల నుంచి చల్ల గాలులు ఎక్కువగా వస్తుండడంతో చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. అలాగే మరుగుదొడ్ల తలుపులతో పాటు పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని, డార్మెటరీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో కనీస నివాస యోగ్యంగా లేదని విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు.

నాడు-నేడు పథకంలో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్ ఏడాదిగా మూలకు చేరడంతో తాగునీటికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అలాగే పైపులైన్లు పాడవ్వడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది. దీంతో స్నానాలకు సక్రమంగా నీరు అందక విద్యార్థులు నరకం చూస్తున్నారు. ఆట స్థలం అసంపూర్తిగా ఉండడంతో క్రీడలకు పలు ఇబ్బందులు తప్పవడం లేదు. ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వసతి గృహాలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. ఈ సమస్యలపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నూకరాజును వివరణ కోరగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు సమస్యలను గుర్తించి, పరిష్కారానికి అవసరమైన పనులు చేపట్టడానికి నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని ఆయన తెలిపారు.



మూలకు చేరిన మినరల్ వాటర్‌ప్లాంట్



సమస్యలకు నిలయమైన గురుకుల కళాశాల భవనం... డార్మెటరీ మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ట్యాపులు లేని తాగునీటి పైపులైన్లు

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం

-కె.సాయికుమార్, ఇంటర్ విద్యార్థి



మరుగుదొడ్ల పైపులైన్ మరమ్మతులకు గురవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే మరుగుదొడ్ల తలుపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రతీ రోజు ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై పలుమార్లు ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించాం. ఈ సమస్యలు పరిష్కరించాలని పాలకులు, అధికారులను కోరుతున్నాం.



మరమ్మతులకు గురైన వసతి గదుల కిటికీలు, మరుగుదొడ్ల తలుపులు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న ఆర్డీవో రమణ

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీవో

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ అధికారులకు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 15 వినతిపత్రాలు స్వీకరించారు. మాకవరపాలెం పైడిపాల గ్రామంలోని 112/1 సర్వే నంబరులో 9.44 ఎకరాలు, కుసర్లపూడిలోని సర్వే నంబరు 687లో 2.80 ఎకరాలు, సర్వే నంబరు 672లో 4.65 ఎకరాల చొప్పున 40 ఎకరాలలో ఉన్న ప్రైవేటు లేఅవుట్‌లో రాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని స్థానిక వ్యాపారులు వెలగా నారాయణరావు, కన్నయ్యశెట్టి తదితరులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పెన్షన్లు, రేషన్ కార్డు, భూ వివాదాలకు సంబంధించి వినతిపత్రాలు వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఆస్పత్రుల్లోనే శతశాతం ప్రసవాలు చేయాలి

▸▸ డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

రోలుగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే శతశాతం డెలివరీలు పూర్తియ్యేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి ఆదేశించారు. సోమవారం రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సూచించారు. హైరిస్క్ ఉన్న గర్భిణీలందరికీ స్కానింగ్ చేసి అవరమైన పరీక్షలు నిర్వహించి నిత్యం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. రోగులకు సకాలంలో వైద్య సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి శ్రావణి, ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, పీహెచ్‌ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ సాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

▸▸ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్



విజేతలను సత్కరిస్తున్న తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్

చోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తాచాటి ఉమ్మడి జిల్లాకు మరిన్ని పతకాలు సాధించాలని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్ తైక్వాండో క్రీడాకారులకు సూచించారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు అనేక ప్రోత్సాహకాల పాలసీ ప్రకటించిందని, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వపరంగా గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ మాట్లాడుతూ వచ్చే నెల హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గణేశ్, అసోసియేషన్ సభ్యులు డీవీ చారి, చవల శేఖర్, సీనియర్ కోచ్‌లు కొల్లిపార ప్రదీప్‌కుమార్, షేక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో పాముల అలజడి



పార్కులో కట్టలపాము.. రక్తపొడ

కృష్ణాదేవిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ రాజు పార్కులో పాముల సంచారం అధికమైంది. సోమవారం తెల్లవారుజామున ఐదు అడుగుల కట్టలపాము, మూడున్నర అడుగుల రక్తపొడ పార్కులో సంచరించాయి. ఇవి పార్కులోని కోళ్లపై దాడిచేసే యత్నం చేశాయి. ఎంత తరిమినా పాములు వెళ్లకపోవడంతో చేసేది లేక పర్యాటకులకు ప్రమాదం ఉంటుందని భావించి పార్కులో పనిచేస్తున్న వాచ్‌మేన్ లగుడు చినబాబు, గ్రామస్థులు ఓ పామును హతమార్చాడు. ఇప్పటికే ఇక్కడ పలు జాతుల పాములు హతమైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరుకావాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న గిరిజనులు

చీడికాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓఎస్ 41 కేసులో రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరుకావాలంటూ కోనాం పంచాయతీకి చెందిన పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చీడికాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారుడు పీఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కోనాం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 275, 287లలో 17 ఎకరాల 75 సెంట్లు సీలింగ్ మిగులు భూమిని అధికారులు గుర్తించారన్నారు. గుంటు శివారు గ్రామానికి చెందిన ఆదివాసీలు సాగు చేస్తున్నారన్నారు. కానీ, అధికారులు సరైన పరిశీలన చేయకుండా గిరిజనేతరులకు పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. దీంతో సాగుచేస్తున్న గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబరులో జరిగే రెవెన్యూ సదస్సులో సాగు చేస్తున్న గిరిజనుల పేరున నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో నాలుగో కార్తీక మాస పర్వదినం సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి భక్తులు ఆలయాలకు తరలివెళ్లి పూజలు చేసి తీర్థప్రసాదం స్వీకరించారు. స్థానిక స్వర్గలింగేశ్వర ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. సుమారు రెండు వేల మంది భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే చాలా మంది భక్తులు కుటుంబ సమేతంగా శివాలయాలకు వచ్చి దర్శించుకున్నారు.

ఓం.. శివోహం

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కార్తీక మాసం చివరి సోమవారం
- పోటెత్తిన భక్తులు

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెదబొడ్డేపల్లి శివాలయం, నర్సీపట్నంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, బలిఘట్టంలోని శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బలిఘట్టంలో త్రిశూల పర్వత శ్రేణిపై కొలవై ఉన్న శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలో ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ శాఖాధికారులు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. స్ఫటిక లింగం రూపంలో ఉన్న శివయ్యకు భక్తులు గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయంలో ధ్వజ స్తంభం, నందీశ్వరుడు, ఉసిరి, రావి చెట్టు వద్ద మహిళలు దీపారాధన నిర్వహించారు.



నర్సీపట్నం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు...



రావికమతంలోని చినపాచిల శివాలయం ధ్వజ స్తంభం వద్ద దీపాలంకరణ చేస్తున్న భక్తులు

రావికమతంలో..

రావికమతం: కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో వేకువ జామునుంచే రావికమతం, కొత్తకోట, మేడివాడ, కవ్వగుంట గ్రామాలలోని శివాలయాలు భక్తులతో కిటకిలాడాయి. తెల్లవారు జాము నుంచీ పూజలు, అభిషేకాలను భక్తులు చేయించుకున్నారు. హరహర మహాదేవా.. శివ శంభో మహాదేవా అంటూ శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. అలాగే ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి భక్తితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినపాచిల లక్ష్మీసత్యనారాయణ, సీతారామలక్ష్మణ ఆలయంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రావికమతంలో జెండర్ రీసోర్స్ సెంటర్ ప్రారంభం

రావికమతం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వేధింపులకు గురవుతున్న మహిళలను ఆదుకోవడానికి ప్రభుత్వం జెండర్ రీసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మండల కేంద్రంలో సోమవారం మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు విశాలాక్షి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు, మహిళలు, వెలుగు సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశాలాక్షి మాట్లాడుతూ మండల పరిధిలో డ్వాక్రా సభ్యులతో పాటు వివిధ వర్గాలకు చెందిన మహిళలు ఎదుర్కొంటున్న వరకట్న వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్, పరిశ్రమలు, బస్టాండ్‌లలో అసభ్య ప్రవర్తన, అవమానకర రీతిలో మాట్లాడడం తదితర వేధింపులపై ఈ సెంటర్‌లో ఫిర్యాదులు చేసుకోవచ్చునని చెప్పారు. తహసీల్దార్, ఎంపీడీవో, సబ్ ఇన్‌స్పెక్టర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సభ్యులుగా గల కమిటీ ఈ ఫిర్యాదులపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించని పక్షంలో జిల్లా స్థాయి కమిటీకి సిఫారసు చేస్తామన్నారు. కౌన్సెలింగ్‌తో పరిష్కారం కాని వేధింపులను న్యాయస్థానం దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్టు చెప్పారు. న్యాయస్థానంలో ఉచితంగా న్యాయ సాయం కూడా అందుతుందని ఆమె చెప్పారు. అంతకు ముందు గ్రామంలో లింగ వివక్షత మానుకోవాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బాల్య వివాహాలను అరికట్టాలని నినాదాల చేస్తూ ర్యాలీ సాగించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.రఘువర్మ, ఏఎస్‌ఐ అప్పలరాజు, వెలుగు ఏపీఎం ఈశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



రావికమతంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వెలుగు సిబ్బంది, మహిళలు

వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎం స్వనిధి, స్వభిమాన్ పక్వాడ పథకంలో భాగంగా మునిసిపాలిటీలోని 30 మంది వీధి వ్యాపారులకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ జరిగింది. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో ఎస్‌బీఐ (ఏడీబీ) బ్రాంచ్ మేనేజర్ ఎస్‌బీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ ఎన్.సరోజిని మాట్లాడుతూ పీఎం స్వనిధి రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు సురక్ష బీమా, జీవనజ్యోతి బీమా యోజన, జననీ సురక్ష బీమా యోజన, పీఎం మాతృవందన, వన్ నేషన్ వన్ రేషన్ కార్డు పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అనంతరం ఆమె మెప్మా బజార్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేంద్ర, కార్మిక శాఖ అధికారి సత్యనారాయణ, డీసీఎం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై చైతన్యం తీసుకురండి

చీడికాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఎంపీడీవో హేమసుంద్రరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ లైన్‌మన్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: సీఐ

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ గోవిందరావు సూచించారు. పట్టణంలోని విద్య డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా చేసినా, తాగినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. గంజాయి కేసు నమోదైతే గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు పడుతుందని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, కరస్పాండెంట్ సత్యవతి, డైరెక్టర్ బోళెం దొరబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెం: అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో సీఐ రేవతమ్మ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు అలవాట్లు చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఎస్‌ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ ఈ-కేవైసీకి మామూళ్లు

▸▸ జిల్లా కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు



కొమరవోలులో ఆదివారం రాత్రి ఈ-కేవైసీ చేస్తున్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

రోలుగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ పంపిణీ కోసం చేయాల్సిన ఈ-కేవైసీని నర్సీపట్నం ఇండియాన్ గ్యాస్ సిబ్బంది డబ్బులు వసూళ్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) పేరుతో గ్యాస్ ఏజెన్సీ వసూళ్లు చేస్తోంది. గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని క్షేత్రస్థాయిలోనే గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం గ్రామాల్లోనే ఉచితంగా ఈకేవైసీ పూర్తి చేస్తారని అటు ప్రభుత్వం, ఇటు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులతో కూడిన ఆదేశాలు జారీ చేశారు. కాగా వినియోగదారుల అవసరాన్ని గుర్తించిన యాజమాన్యం గ్రామాల్లో సిబ్బందితో వసూళ్లు చేయిస్తున్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కొమరవోలుతో పాటు పలు గ్రామాల్లో ఇండియాన్ సిబ్బంది ఉచిత గ్యాస్‌కు ఈ-కేవైసీ క్యాంపులు పెట్టారు. స్థానిక పంచాయతీ, రామాలయం వద్ద ఈకేవైసీ క్యాంపు ఏర్పాటు చేసి ఒక్కొక్క లబ్ధిదారుడు నుంచి రూ.30 నుంచి రూ.50 వసూళ్లు చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ నెల 8న ఇదే ఇండియన్ గ్యాస్ యాజమాన్యంపై ఈకేవైసీకి అక్రమ వసూళ్లపై నర్సీపట్నం ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా యాజమాన్యం అక్రమ వసూళ్లు ఆపడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి తెలిపారు.

రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాడుగుల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నాయకులు నరసింహమూర్తి, కార్లి భవానీ డిమాండ్ చేశారు. సోమవారం శంకరం పంచాయతీ బొడ్డరేవు గిరిజన గ్రామంలో గిరిజనులతో కలిసి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

కె.కోటపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26, 27 తేదీల్లో వర్షాలు పడే సూచనలు ఉండటంతో మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులందరూ ఇప్పటికే కోసి వేసిన వరి పనలను త్వరగా కుప్పలు పెట్టుకోవాలని ఆయన కోరారు. కోయలేని వరి పంటను రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు ఏఎస్‌డబ్ల్యూవో గోపినాథ్ ఆధ్వర్యంలో కార్పెట్లు పంపిణీ చేశారు. సోమవారం పెదబొడ్డేపల్లి ఆనందనిలయం, నర్సీపట్నం ఎస్సీ బాలుల వసతిగృహం-2లోని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూవో గోపినాథ్ మాట్లాడుతూ పది వసతి గృహాల పరిధిలో 937 మంది విద్యార్థులకు కార్పెట్లు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు అల్లు గోవిందరావు, రెహ్మాన్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించారు: ఎంపీటీసీ

గొలుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏటిగైరంపేటలో ప్రొటోకాల్ పాటించకుండా బోరు ప్రారంభించారని ఎంపీటీసీ సభ్యురాలు చింతల కాంతం ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి రామాలయం వీధిలో వేసిన తాగునీటి బోరును సోమవారం సర్పంచ్ రామకృష్ణ, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించినట్టు చెప్పారు. అయితే ప్రారంభోత్సవ బోర్డులో సర్పంచ్ తరువాత ఎంపీటీసీ పేరు నమోదు చేయకుండా మాజీ ఎంపీటీసీ పేరు ఎలా నమోదు చేస్తారని అధికారులను నిలదీయగా సమాధానం చెప్పలేదని వాపోయారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె చెప్పారు.

వార్డుల్లో వైద్య శిబిరాలు

చోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం వీధిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బొడ్డాన రామలక్ష్మి, పి.రమణమ్మ, సిహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి

రోలుగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కుసర్లపూడికి చెందిన కిల్లాడ సాంబమూర్తి, ఇతర సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంఘంలో కాలపరిమితి పూర్తయిన రుణాలకు సంబంధించి రికార్డులను తారుమారు చేశారని, సభ్యులకు తెలియకుండా అసలులో రూ.100 కార్యదర్శి కట్టి రుణాలను బతికించి, వాటిపై దావాలు వేసి జప్తు నోటీసులు సంఘ సభ్యులకు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పీఏసీఎస్‌ను పూర్తిగా నష్టాల్లోకి నెట్టేశారని గతంలో నిర్వహించిన ఆడిట్ రిపోర్టులో కూడా రూ.1.5 కోట్లు నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి నిగ్గుతేల్చాలని కోరారు.

'నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలకు పోస్టింగ్ ఇవ్వాలి'

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలకు తిరిగి నర్సీపట్నంలో పోస్టింగ్ ఇవ్వాలని బీఎస్పీ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. విధి నిర్వహణలో ఆమె నిజాయితీగా పనిచేశారని పేర్కొన్నారు. ఆమెపై కొంత మంది కావాలనే లేనిపోని ఆరోపణలు చేశారని ఫిర్యాదులో తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కృష్ణాదేవిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు, ఇతర సైబర్ నేరాలపై సోమవారం కృష్ణాదేవిపేట ఆర్టీసీబస్‌స్టేషన్, అల్లూరిపార్కు, ప్రధాన కూడలి వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆన్‌లైన్లతో ఉద్యోగాలు పేరట సైబర్ నేరాలు జరుగుతున్నాయని ఎస్‌ఐ చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

శీతాకాలంలో జరభద్రం

వ్యాధులు విజృంభించే సీజన్

- తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యానికి ముప్పు



- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి
- ఉన్ని దుస్తులు ధరించాలి
- గుండె, శ్వాస, రక్తపోటు రోగులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- మద్యం అధికంగా సేవించ కూడదు
- వైద్య నిపుణుల సూచన

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): **మన్యంలో చలి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొన్నిసార్లు ఏకసంఖ్యలో నమోదవుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలోనూ శీతలగాలులు వీస్తున్నాయి. డిసెంబరు, జనవరి మాసాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గే అవకాశముందని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు.**



ఉన్నిదుస్తులు ధరించి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

గిరిజన ప్రాంత వాతావరణం పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నప్పటికీ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుతం గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రతకు చిన్నపిల్లలు, మహిళలు, గర్భిణులు, వృద్ధులు ఆరోగ్యపరంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత శీతల వాతావరణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

చలికాలంలో ఎదురయ్యే సమస్యలు

చిన్నారులు, వృద్ధులు ఈ సీజన్‌లో ప్రధానంగా జలుబు, గొంతు సమస్యలతో బాధపడుతుంటారు.



ఉన్నిదుస్తులు ధరించి బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

వైరల్ జ్వరాలు కూడా వ్యాప్తి చెందుతాయి. పెదవులు పగిలిపోవడం, పగిలిన పెదాల నుంచి రక్తస్రావం జరుగుతుంది. చర్మం పొడిబారిపోతుంది. చర్మంపై దురద, తామర వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. 45 ఏళ్లు పైబడినవారు, వృద్ధుల్లో కీళ్లనొప్పులు, కీళ్లవాపుల సమస్యలు ఎదురవుతాయి. చన్నీళ్లతో కాలకృత్యాలు తీర్చుకోవడం, మంచులో ప్రయాణం చేయడం వల్ల పంటి సలుపులు వస్తాయి. ఆస్తమా రోగులకు శ్వాస తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. చిన్నపిల్లల్లో జలుబు ఎక్కువై నాసికారంధ్రాలు మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడుతుంటారు. గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారిలోనూ సమస్యలు అధికమవుతాయి. రక్తపోటు వున్నవారిలో చెమట బయటకు రాకపోవడం వల్ల బీపీ పెరిగే అవకాశముంది. కుంపటి, చలి మంటల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శీతాకాలం మంచులో తడవడం, చల్లగాలుల్లో తిరగడం చేయకూడదు. చిన్నపిల్లలను చల్లగాలుల్లో ఆడుకోనివ్వరాదు. శరీరం అంతా కప్పబడే స్వెట్టర్లు, స్కార్ఫ్, మంకీ టోపీలు, గ్లౌజులు, సాక్స్‌లు ధరించాలి. ఒకే చోట ఎక్కువ సమయం కూర్చొని వుండకుండా చలి, మంచు తగలకుండా ఇంట్లోనే నడవాలి. జలుబు అధికంగా వుంటే ఆవిరి పట్టాలి, గొంతు సమస్యలున్నవారు గ్లాసు గోరువెచ్చని నీళ్లలో చెంచా ఉప్పువేసి కలుపుకుని పుక్కిలించాలి. ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా వుంచుకోవాలి, కర్చీఫ్‌ను తరచూ మారుస్తూ ఉండాలి. చిన్నపిల్లలకు ముక్కు మూసుకుపోయి శ్వాసతీసుకోవడానికి ఇబ్బందిగా వుంటే నాసిక రంధ్రాల్లో నాజల్‌డ్రాప్స్ గాని, ఉప్పునీటి చుక్కలు గాని వేయాలి. వేడి నీళ్లు తాగాలి, నిల్వ ఆహారం తినకూడదు. ఆహారం వేడిగా వున్నప్పుడే తినడం చాలా మంచిది. వారపు సంతల్లో లభించే నిల్వ మాంసాహారం కొనుక్కొని తినకూడదు. పెదవులు పగిలిపోకుండా గ్లిజరిన్ కలిగిన లిప్‌బామ్‌లుగాని, వెన్న, కొబ్బరి నూనెగాని రాసుకోవాలి. రాత్రి పడుకునే ముందు రాసుకోవడం చాలా మంచిది. వాకింగ్ చేసేవారు విధిగా షూ, గ్లౌజులు, ఉన్నిదుస్తులు, మంకీటోపి ధరించాలి. శీతలపానీయాలు, రహదారి ఇరుపులా విక్రయించే వంటకాలు(ఫాస్ట్‌ఫుడ్) తగ్గించాలి. ఆస్తమా వున్నవారు చల్లగాలులు, మంచుకు పూర్తిగా దూరంగా వుండాలి. ద్విచక్రవాహనదారులు ప్రత్యేక రక్షణ దుస్తులతోపాటు హెల్మెట్ ధరించాలి. కుంపటి, చలి మంటలు పెట్టుకునే సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. శీతాకాలంలో గాయాలు త్వరగా నయంకావు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



శీతాకాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుతం జలుబు, గొంతునొప్పి, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులతో రోగులు అధికంగా ఆస్పత్రికి వస్తున్నారు. చలి, మంచుకు దూరంగా వుంటే దాదాపు వ్యాధులను నియంత్రించుకోవచ్చు. గుండె, శ్వాస, రక్తపోటు రోగులు తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలి. చలి ఎక్కువగా వుందని సారా, కల్లు, వైన్(ఆల్కాహాల్) అధికంగా సేవించకూడదు. అధికంగా సేవిస్తే డీహైడ్రేషన్‌కి గురై అనారోగ్య సమస్యలు అధికమవుతాయి.

- డాక్టర్ జి.ప్రభావతి, మెడికల్ సూపరింటెండెంట్, చింతపల్లి

కూరగాయల ఆహారం తీసుకోవాలి



శీతాకాలంలో కూరగాయలను ఆహారంగా తీసుకోవడం చాలా ఉత్తమం. వేడినీళ్లు, బార్లీ, వేపుడుజావ, రాగి, సామ, జొన్న, కొర్ర జావలు అధికంగా తీసుకోవాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచే ఓట్స్, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కాలీఫ్లవర్, తేనె తీసుకోవాలి. మాంసాహారం మితంగా తీసుకోవాలి. రోజూ తీసుకునే ఆహారంలో అల్లం, వెల్లుల్లి, మిరియాలు వుండే విధంగా చూసుకోవాలి. టీ, కాఫీలు అధికంగా తాగరాదు. విటమిన్ ఏ, సీలు వుండే పండ్లు, పండ్లరసాలు తీసుకోవడం మంచిది.

- బి.దివ్యసుధ, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త, బీసీటీకేవీకే, హరిపురం

క్రైం... crime news

దారి దోపిడీ కేసులో ఐదుగురి అరెస్టు

- రూ.6.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును చూపుతున్న డీఎస్పీ మోహన్

పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాండవ షుగర్స్ సమీపంలో దారి దోపిడీకి పాల్పడిన నిందితులను స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు రూ.6.5 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కి చెందిన నోకియాసెల్ ఫోన్ కంపెనీ టెలికాం ఫీల్డ్ ఇంజనీర్ మహమ్మద్ దిల్షాద్ ఈనెల 15వ తేదీ రాత్రి తుని రైల్వే స్టేషన్‌లో రైలు దిగి పాయకరావుపేటలోని తాండవ షుగర్స్ సమీపంలో ఉన్న ఎయిర్‌టెల్ కార్యాలయానికి నడుచుకుంటూ వెళుతున్నాడు. షుగర్ ఫ్యాక్టరీ మలుపువద్ద ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్డగించారు. కత్తిచూపి బెదిరించి ల్యాప్‌టాప్‌ని లాక్కునే ప్రయత్నం చేశారు. దిల్షాద్ ప్రతిఘటించడంతో కత్తితో అతని చేతిపై గాయపరిచి ల్యాప్‌టాప్‌తోపాటు సెల్ ఫోన్, చేతి గడియారం, ఇతర వస్తువులను లాక్కుని పారిపోయారు. అనంతరం ఎయిర్‌టెల్ ఆఫీసుకి చేరుకున్న దిల్షాద్ జరిగిన విషయాన్ని స్నేహితులకు తెలియజేసి పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన సీఐ జి.అప్పన్న సోమవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దిల్షాద్ వద్ద దోపిడీ చేసిన వస్తువులతోపాటు మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6.5 లక్షలు వుంటుంది. మూడు బైక్‌లకు సంబంధించి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయని డీఎస్పీ చెప్పారు. నిందితుల్లో ఇద్దరు పాయకరావుపేటకు చెందినవారుకాగా, కాకినాడ జిల్లా తుని, కోటనందూరు, అల్లూరి జిల్లా ముంచంగిపుట్టుకు చెందిన వారు ఒక్కొక్కరు వున్నారని వారని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి నలుగురిని రిమాండ్‌కు తరలించామని, ఒకరు మైనర్ కావడంతో విశాఖలోని జువెనైల్ హోమ్‌కి పంపించామని ఆయన వెల్లడించారు.

వీఆర్వోను దుర్భాషలాడిన వ్యక్తి అరెస్టు

- కోర్టులో హాజరు, రిమాండ్‌కు తరలింపు

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వీఆర్వోను దుర్భాషలాడడంతోపాటు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడకు చెందిన షేక్ ఇస్మాయిల్ స్థానిక పీహెచ్‌సీ ఎదుట వున్న ప్రభుత్వం స్థలంలో మాంసం దుకాణం నడుపుతున్నాడు. దీనిపై స్థానికులు ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. స్పందించిన ఆయన ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన మాంసం దుకాణం షెడ్‌ను తొలగించాలని వీఆర్వో జి.సత్యనారాయణను ఆదేశించారు. ఈ నెల 22న వీఆర్వో ఆ దుకాణాన్ని తొలగించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళుండగా స్థానిక బీసీ కాలనీ వద్ద ఇస్మాయిల్, అతని తల్లి ఫాతిమా బీబీ అడ్డుకుని వీఆర్వోను దుర్భాషలాడారు. సంగతి తేలుస్తామంటూ బెదిరించారు. దీనిపై వీఆర్వో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇస్మాయిల్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేశారు. అనంతరం అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. కాగా ఇస్మాయిల్ పత్రికా విలేకరిగా చెప్పుకుంటూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో అధికారులు, స్థానికులపై తప్పుడు సమాచారం పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇతనిపై గతంలో పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

- అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా చినబ్బాయి ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం రాత్రి స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగాయి. రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షురాలిగా వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొంది చిన బ్బాయి, గౌరవ అధ్యక్షుడిగా పంపనబోయిన వెంకటరావు, సహ అధ్యక్షుడిగా రొంగలి అక్కునాయుడు, మహిళా సహ అధ్యక్షురాలిగా పి.గాయత్రి, కార్యదర్శులుగా దొగ్గ శ్రీనివాస్, కళింగ సతీశ్, పొలిమేర చంద్రరావు, గుత్తుల సూర్యప్రకాశ్, మాకిరెడ్డి రాజునాయుడు, వి.రమేశ్‌రావు, నడికట్ల శేషుకుమార్, కోశాధికారిగా జోగా రాజేశ్ ఎన్నికయ్యారు. జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్‌గా హైమావతి, సభ్యులుగా వేచలపు నాగేశ్వరరావు, షేక్ సలీమ్, శాంతకుమారి, అనిమిరెడ్డి సాంబమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఈ.యల్లయ్యబాబు, ఎం.వెంకటఅప్పారావు, గేదెల శాంతిదేవి ఎన్నికయ్యారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ విజయకృష్ణన్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమెతో జాయింట్ కలెక్టర్ జాహ్నవి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురి సమస్యల గురించి ఆరా తీశారు. పూడిమడక శివారు కడపాలెంలో తాను చేపట్టిన పంచాయతీ రాజ్ పనులకు సంబంధించి రావాల్సిన రూ.18 లక్షలను అధికారులు స్వాహాచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ అచ్యుతాపురం మండలం పూడిమడక పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ చోడిపిల్లి అప్పారావు ఫిర్యాదు చేశారు. రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీ గేటు నుంచి వెంకటాపురం వరకు కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, పలువురు ప్రజా సంఘాల నాయకులు అర్జీ అందజేశారు. పరిష్కారం నిమిత్తం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు.

ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఇక్కడ ప్రజలు అందించే వినతులతోపాటు సీఎంఓ నుంచి వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వీటికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో కూడా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల మండల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కాగా పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలకు సంబంధించి 243 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఎస్పీ దేవప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. వివిధ అంశాలకు సంబంధించి 43 అర్జీలు అందగా, వాటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ కార్యక్రమంలో మరో ఏఎస్పీ మోహనరావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిపై లోక్‌సభలో ప్రస్తావన

- వివరాలు వెల్లడించాలని కోరిన ఎంపీ రమేశ్



లోక్‌సభలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సోమవారం మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని, ఉద్యోగుల రాజ్య బీమా (ఈఎస్ఐ) సంస్థ ఆమోదం, భూమి కేటాయింపు, ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు వంటి వివరాలను వెల్లడించాలని కోరారు. దీనిపై కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా మాట్లాడుతూ, అచ్యుతాపురంలో 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు 2020 ఫిబ్రవరి 21న ఉద్యోగుల రాజ్య బీమా (ఈఎస్ఐ) సంస్థ ఆమోదం తెలిపిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని కేటాయించగా, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం జరిగిందన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను సీపీడబ్ల్యూ విభాగానికి అప్పగించినట్టు చెప్పారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి మూడు నెలల క్రితం రూ.62 కోట్లు మంజూరు చేసినట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు.

మూలకు చేరిన అమూల్

... 5వ పేజీ తరువాయి

ఐదు మండలాల్లో జగనన్న పాల వెల్లువ పథకం పేరుతో అమూల్‌కు పాల సేకరణ ప్రారంభించారు. మొత్తం 305 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్నింటికి ఉపాధి హామీ పథకం నిధులతో భవనాలు నిర్మించగా, ఎక్కువ కేంద్రాలను పంచాయతీ భవనాలు, సామాజిక కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. రోజూ 50 వేల లీటర్ల పాలను సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఒక్క రోజు కూడా 30 వేల లీటర్లకు మించలేదు. పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ, ఇతర ప్రైవేటు డెయిరీల కంటే ఎక్కువ చెల్లించకపోవడంతో రైతులు అమూల్‌కు పాలు పోయడం తగ్గించేశారు. దీంతో క్రమేపీ పాల సేకరణ తగ్గిపోయింది. ప్రస్తుతం ఐదు వేల లీటర్లలోపే పాల సేకరణ జరుగుతున్నది. అరకొరగా పాలు సరఫరా అవుతున్న కేంద్రాలను ఇప్పటికే మూసివేశారు. దాదాపు సగం కేంద్రాలు మూతపడినట్టు సమాచారం. ఇటువంటి వాటిలో మునగపాక మండలం మూలపేట, పాటిపల్లి, కాకరాపల్లి, తోటాడ, పి.ఆనందపురం, చోడవరం మండలం జుత్తాడ, అంబేరుపురం, రాయపురాజుపేట, అచ్యుతాపురం మండలం ఆవసోమవరం, చీమలాపల్లి, మడుతూరు, వెదురువాడ, వగైరా వున్నాయి.

సెంట్రల్ స్కూల్ పట్టాలెక్కేనా!

... 5వ పేజీ తరువాయి

ప్రస్తావించారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రారంభం అవుతుందని ఆమె ప్రకటించారు. కానీ విద్యాలయం ఏర్పాటు కాలేదు.

టీడీపీ హయాంలోనే పది ఎకరాలు కేటాయింపు

కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణాలకు భూమి కోసం అనకాపల్లి మండలంలో మామిడిపాలెం, కోడూరు, అచ్చియ్యపేట తదితర గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. చివరకు సీతానగరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేట గ్రామంలో సర్వే నంబరు 511లో సుమారు పది ఎకరాలను 2018లో రెవెన్యూ అధికారులు కేటాయించారు. ప్రధాన రహదారి నుంచి ఇక్కడకు వెళ్లడానికి రోడ్డు లేకపోవడంతో అచ్చియ్యపేటలో ఉన్న కళింకోట కోదండ సీతారామాలయ భూముల నుంచి కొంతస్థలాన్ని సేకరించి రహదారి ఏర్పాటు చేశారు. మధ్యలో గెడ్డలపై కల్వర్టుల నిర్మాణం, తుప్పలు తొలగింపు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తదితర పనుల కోసం రూ.39.44 లక్షలు ఖర్చు చేశారు. పనులు పూర్తయిన తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు నిధులు మంజూరు కోసం కేంద్రంపై ఒత్తిడి చేయలేదు. గత ఏడాది జూన్ 5వ తేదీన అప్పటి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, కేంద్రీయ విద్యాలయం డిప్యూటీ కమిషనర్ మంజునాథం కలిసి కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి అవసరమైన ఉత్తర్వులను తయారు చేసి త్వరలో సీపీడబ్ల్యూ అధికారులకు అందజేసి నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. కానీ ఆమె హామీ అమలుకు నోచుకోకుండానే ఐదేళ్ల పదవీ కాలం పూర్తయ్యింది.

కేంద్రం ఆమోదానికి ఎంపీ రమేశ్ కృషి

రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనకాపల్లిలో జరిగిన ఒక సమావేశంలో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయించేందుకు కృషిచేస్తున్నట్టు ఎంపీ సీఎం రమేశ్ ప్రకటించారు. దీనిపై పురోగతిపై ఎంపీ రమేశ్ కార్యాలయ వర్గాలను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించడగా.. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన ఫైలును సిద్ధం చేసి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపినట్టు వెల్లడించారు. సోమవారం నుంచి ప్రారంభమైన శీతాకాల సమావేశాల్లోనే దీనికి ఆమోద ముద్ర వేయించాలన్న కృతనిశ్చయంతో ఎంపీ రమేశ్ వున్నారని పేర్కొన్నారు.

రైల్వే జోన్ భవనం 12 అంతస్థులు

... 5వ పేజీ తరువాయి

ఎస్‌డబ్ల్యూఆర్ఏసీ రూమ్, స్టోర్ రూమ్, కంప్యూటర్ రిజర్వేషన్, కిచెన్ అండ్ డైనింగ్, టెలీ ఎక్స్ఛేంజ్ ఆఫీసు, జోనల్ కంట్రోల్‌రూమ్, స్పారో రూమ్, ప్రీ కాన్ఫరెన్స్ రూమ్, సమావేశ మందిరం, ఐటీ విభాగం ఉంటాయి.

నాలుగో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీ. ఇందులో ఫైనాన్స్ డిపార్టుమెంట్, అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాలు, లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ ఉంటాయి.

ఐదో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీ. ఇందులో ఆపరేషన్ డిపార్టుమెంట్, కిచెన్, డైనింగ్, స్టోర్, స్టాఫ్ రూమ్, జనరల్ మేనేజర్ ఆఫీసు, డీజీఎం ఆఫీసు, ఏడీజీఎం ఆఫీసు, మీటింగ్ రూమ్, సమావేశ మందిరం, జీఎం ఆఫీస్ స్టాఫ్, జీఎం యాంటీ రూమ్, సెక్రటరీ రూమ్ ఉంటాయి.

ఆరో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీ. ఇందులో ఆఫీస్ స్పేస్, టీ రూమ్, ఎస్ అండ్ టి విభాగం ఉంటాయి.

ఏడో అంతస్థు: 2,702.83 చ.మీ. ఇందులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సెక్రటరీ, ఏజీఎం, మీటింగ్ రూమ్, ఎస్‌డీజీఎం రూమ్, పాంట్రీ, మెడికల్ రూమ్ ఉంటాయి.

ఎనిమిదో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీ. ఇందులో పర్సనల్ డిపార్టుమెంట్, కిచెన్, క్యాంటీన్, ఎగ్జిక్యూటివ్ డైనింగ్, స్టోర్స్ ఉంటాయి.

తొమ్మిదో అంతస్థు: బిల్టప్ ఏరియా 2,702.83 చ.మీ. ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు, సమావేశ మందిరం, ప్రి కాన్ఫరెన్స్ హాలు ఉంటాయి.

నిర్మాణ వ్యయం

కింద బేస్‌మెంట్‌కు రూ.13.53 కోట్లు, అప్పర్ బేస్‌మెంట్‌కు రూ.13.45 కోట్లు, గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ7.32 కోట్లు, మొదటి అంతస్థుకు రూ.8.73 కోట్లు, తరువాత ప్రతి అంతస్థుకు రూ.7.32 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. భవనం వెలుపల అభివృద్ధి పనులకు రూ.10.17 కోట్లు, సీసీ టీవీ కెమెరాలు, లాన్, ఇంటీరియన్, ఫర్నిషింగ్‌లకు రూ.23.5 కోట్లు అవుతాయని అంచనా వేశారు. మొత్తంగా కలిపి రూ.154.82 కోట్లు వ్యయం అవుతుందని లెక్క తేల్చారు.

చిత్తశుద్ధితో పనిచేస్తా

... 5వ పేజీ తరువాయి

సత్యనారాయణమూర్తి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఇతర పార్టీ నాయకులు ప్రణవ్ గోపాల్‌ను అభినందించారు. వీఎంఆర్‌డీఏ తరఫున కమిషనర్ విశ్వనాథన్ శుభాకాంక్షలు తెలిపారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ప్రణవ్‌గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను అందుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ప్రతిరోజూ కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు.

వైసీపీ నేత అక్రమ కట్టడం కూల్చివేత

... 5వ పేజీ తరువాయి

గజాల లోపు స్థలంలో నిర్మాణానికి అనుమతి ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించవని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ వైసీపీ నేత కావడం, అప్పుడు పార్టీ అధికారంలో వుండడంతో ప్లాన్ ఆమోదం లేకుండానే భవన నిర్మాణం చేపట్టారు. చుట్టూ ఎటువంటి ఖాళీ స్థలం వదల్లేదు. మొదటి అంతస్థులోకి వెళ్లడానికి డ్రైనేజీ కాలువ మీదుగా రౌండ్ మెట్లు నిర్మించారు. రెండో అంతస్తు కూడా నిర్మించడానికి మొదటి అంతస్థులో నుంచి మెట్ల దారి కోసం శ్లాబ్‌లో ఖాళీ విడిచిపెట్టారు. అడ్డగోలుగా భవనం నిర్మిస్తున్నప్పటికీ వైసీపీ నేత కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు వేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తికావడంతో ఒక ప్రైవేటు డెయిరీకి అద్దెకు ఇచ్చారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భవన నిర్మాణ పనులు ఆపేశారు. అయినప్పటికీ ప్లాన్ ఆమోదం లేకుండా భవనం నిర్మించడంతో మునిసిపల్ అధికారులు జూలై 25న మొదటి నోటీసు జారీ చేశారు. కరుణాకరరావు నుంచి సమాధానం రాకపోవడంతో రెండో నోటీసు, వారం రోజుల క్రితం మూడో నోటీసు ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో సోమవారం తెల్లవారుజామున కూల్చివేత ప్రక్రియ చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ పక్క రోడ్డు, పాత మునిసిపల్ కార్యాలయం నుంచి గచ్చపువీధికి వెళ్లే రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. షాపులోని సామగ్రిని బయటకు తీయించి పై అంతస్థు శ్లాబ్‌కి పెద్ద పెద్ద రంధ్రాలు పెట్టారు. అనంతరం కింది అంతస్థు పిల్లర్లు, గోడలు కూల్చివేశారు. దీనిపై కమిషనర్ సురేంద్రను వివరణ కోరగా అనుమతులు లేకుండా నిర్మించడంతో కూల్చివేయించామని తెలిపారు.

ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

... 5వ పేజీ తరువాయి

పదవ తరగతి ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, విచారణలో నిజమని తేలితే సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకూడదని, ఒకవేళ ఏ విద్యా సంస్థ అయినా సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే సంబంధిత విద్యా సంస్థ గుర్తింపును రద్దు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589